ఆంధ్రజ్యోతి

5



అనకాపల్లి
జిల్లా వార్తలు
సోమవారం 21 అక్టోబరు 2024

నేడు డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ ట్రాన్సిట్ హాల్టు



విశాఖపట్నం, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి): ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ సోమవారం విశాఖ విమానాశ్రయంలో కొద్దిసేపు ఆగనున్నారు. విజయనగరం జిల్లా చీపురుపల్లి నియోజకవర్గం గుర్ల మండలంలో డయేరియా మృతుల కుటుంబాలను ఆయన పరామర్శించనున్నారు. ఉదయం గన్నవరం ఎయిర్‌పోర్టు నుంచి విమానంలో 9.30 గంటలకు విశాఖపట్నం ఎయిర్‌పోర్టుకు చేరుకుని రోడ్డు మార్గాన విజయనగరం జిల్లా వెళతారు. తిరిగి సాయంత్రం 4.10 గంటలకు విమానంలో గన్నవరం వెళతారు.

అధ్వాన రోడ్లకు మోక్షం

ఎన్‌డీబీ రుణంతో చేపట్టిన పనుల్లో కదలిక

- పెండింగ్ బిల్లులకు నిధులు విడుదల చేసిన కూటమి ప్రభుత్వం
- ఉమ్మడి జిల్లాలో రూ.220.62 కోట్లతో పది రోడ్లకు ఐదున్నరేళ్ల క్రితం ఎన్‌డీబీ రుణం
- రివర్స్ టెండరింగ్ పేరుతో వైసీపీ ప్రభుత్వం తీవ్ర కాలయాపన
- ఐదేళ్లపాటు నిధులు ఇవ్వని దుస్థితి
- గోతుల రోడ్లపై ప్రయాణంతో తీవ్ర ఇబ్బందులు పడిన ప్రజలు
- తాజాగా ఎన్‌డీబీ నుంచి రుణం విడుదలకు లైన్ క్లియర్
- త్వరలో రహదారుల అభివృద్ధి పనులు పునఃప్రారంభం
- తొలగనున్న ప్రయాణికుల కష్టాలు



భారీ గోతులు ఏర్పడిన చోడవరం-వెంకన్నపాలెం రోడ్డు (ఫైల్)

చోడవరం, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి): **జిల్లాలో న్యూ డెవలప్‌మెంట్ బ్యాంకు (ఎన్‌డీబీ) రుణంతో చేపట్టి, వైసీపీ హయాంలో నిలిచిపోయిన రహదారుల అభివృద్ధి పనులను పూర్తిచేసే దిశగా కూటమి ప్రభుత్వం అడుగులు వేస్తున్నది. దీంతో అసంపూర్తిగా, అధ్వానంగా వున్న రహదారులకు మోక్షం కలగనున్నది.. వాహనదారులు, ప్రయాణికుల ఇక్కట్లు తొలగనున్నాయి.**

రాష్ట్రంలో ఆర్‌అండ్‌బీ రహదారుల అభివృద్ధికి ఎన్‌డీబీ పెద్ద మొత్తంలో రుణం మంజూరు చేయడానికి ఐదున్నరేళ్ల క్రితం ముందుకు వచ్చింది. మొత్తం వ్యయంలో 70 శాతం సొమ్మును ఏడీబీ రుణంగా ఇస్తుంది. మిగిలిన 30 శాతాన్ని రాష్ట్ర ప్రభుత్వం మార్జిన్ మనీ కింద బ్యాంకుకు చెల్లించాలి. అభివృద్ధి చేసే వాటిలో ఉమ్మడి విశాఖపట్నం జిల్లాలో పది రహదారులు వున్నాయి. 2019 ఫిబ్రవరిలో ఏడీబీ రుణం మంజూరు చేసింది. తరువాత టెండర్ల ప్రక్రియ కూడా పూర్తయ్యింది. పనులు ప్రారంభించే సమయానికి వైసీపీ అధికారంలోకి వచ్చింది. రహదారుల నిర్మాణ పనులను రివర్స్ టెండరింగ్ పేరుతో కాలయాపన చేసింది. ఎట్టకేలకు 2003లో రిటెండరింగ్ ప్రక్రియను పూర్తి చేసింది. కాంట్రాక్టర్లు కొంత మేర పనులు చేసిన తరువాత రాష్ట్ర ప్రభుత్వం మార్జిన్ మనీ 30 శాతం నిధులు విడుదల చేయలేదు. దీంతో ఎన్‌డీబీ నుంచి రుణం మంజూరు ఆగిపోయింది. పనులు చేపట్టిన కాంట్రాక్టర్లకు ప్రభుత్వం బిల్లులు మంజూరు చేయకపోవడంతో అర్ధంతరంగా ఆగిపోయాయి. అప్పటికే విపరీతమైన జాప్యం కారణంగా తీవ్రంగా పాడైన రహదారులు.. అభివృద్ధి అభివృద్ధి పనులు ఆగిపోవడంతో మరింత దయనీయంగా తయారయ్యాయి. ఏడీబీ రుణంతో చేపట్టిన రోడ్ల నిర్మాణ పనులు పూర్తిచేయకపోతే ప్రజల నుంచి తీవ్ర వ్యతిరేకత వస్తుందని, ఎన్నికల్లో గట్టెక్కడం కష్టమని నాటి వైసీపీ ప్రజాప్రతినిధులు.. పార్టీ అధిష్ఠానానికి చెప్పినా పట్టించుకోలేదు. దీంతో ఎన్నికల్లో వైసీపీ అభ్యర్థులు ఘోరంగా ఓటమి పాలయ్యారు. అనంతరం అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం ఎన్‌డీబీ ప్రాజెక్టు కింద చేపట్టిన రోడ్ల నిర్మాణ పనులు పూర్తి చేయడానికి కార్యాచరణను ప్రారంభించింది. 30 శాతం మార్జిన్ మనీ కింద రాష్ట్ర వ్యాప్తంగా రోడ్లకు తొలుత రూ.113 కోట్లు విడుదల చేయడంతోపాటు, గతంలో పనులు చేపట్టిన కాంట్రాక్టర్లకు పెండింగ్ బిల్లులు క్లియర్ చేసినట్టు సమాచారం. ఎన్‌డీబీ నుంచి రుణం సొమ్ము విడుదలతోపాటు, కాంట్రాక్టర్లు తిరిగి పనులు ప్రారంభించేలా రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపట్టింది. దీంతో రహదారుల అభివృద్ధి పనులు కొద్ది రోజుల్లోనే పునఃప్రారంభం అవుతాయని సంబంధిత అధికారి ఒకరు 'ఆంధ్రజ్యోతి'కి తెలిపారు.



వడ్డాది- గరికబంధ మధ్య మాడుగుల మండలంలో ఛిద్రమైన రహదారి



బీఎన్ రోడ్డులో రావికమతం మండలం కొత్తకోట వద్ద భారీ గోతిలో కూరుకుపోయిన లారీ

ఉమ్మడి జిల్లాలో 10 రోడ్లు.. పూర్తయ్యింది ఒక్కటే!

న్యూ డెవలప్‌మెంట్ బ్యాంకు నిధులతో ఉమ్మడి విశాఖపట్నం జిల్లాలో తొమ్మిది అసెంబ్లీ నియోజకవర్గాల్లో రూ.220.62 కోట్ల అంచనా వ్యయంతో పది రోడ్ల అభివృద్ధికి గతంలో టెండర్లు నిర్వహించారు. వీటిలో కొన్ని పనులు ప్రారంభించారు. అరకులోయ నియోజకవర్గంలోని పెదబయలు-ముంచంగిపుట్టు రోడ్డులో రూ.11.71కోట్లతో చేపట్టిన 4.97 కిలోమీటర్ల రోడ్డు పనులు మాత్రమే పూర్తయ్యాయి. మిగిలినచోట్ల పనులు చేపట్టిన మేరకు కాంట్రాక్టర్లకు బిల్లులు రాకపోవడంతో నిలిపివేశారు. మైదాన ప్రాంతంలో అనకాపల్లి, చోడవరం, మాడుగుల, నర్సీపట్నం, పాయకరావుపేట, పెందుర్తి, భీమిలి నియోజకవర్గాల పరిధిలో తొమ్మిది రోడ్ల పనులు అసంపూర్తిగా వున్నాయి.

అనకాపల్లి నియోజకవర్గంలో బవులువాడ నుంచి చోడవరం మండలం వెంకన్నపాలెం వరకు రూ.12.33 కోట్లతో 4.95 కిలోమీటర్లు, వెంకన్నపాలెం నుంచి బుచ్చెయ్యపేట మండలం వడ్డాది వరకు రూ.31.45 కోట్లతో 11.13 కిలోమీటర్లు, వడ్డాది నుంచి నర్సీపట్నం మండలం చెట్టుపల్లి వరకు

... మిగతా 8వ పేజీలో

అడవిపై గొడ్డలి వేటు

పట్టాలమ్మగుడి కొండప్రాంతంలో యూకలిప్టస్ చెట్లు అక్రమంగా నరికివేత

- ఇప్పటికే పది ఎకరాల్లో కనుమరుగైన వృక్షాలుట
- పేపరు మిల్లులకు రవాణా చేస్తున్న అక్రమార్కులు
- అటవీ శాఖ అధికారులు పట్టించుకోవడంలేదని స్థానికులు ఆరోపణ



అటవీ ప్రాంతంలో యూకలిప్టస్ చెట్లు నరికివేయడంతో మిగిలిన మొదలు

కోటవురట్ల, అక్టోబర్ 20 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బోడపాలెం, నీలిగుంట అటవీ ప్రాంతంలో యూకలిప్టస్ (నీలగిరి) ప్లాంటేషన్‌లో చెట్లు అక్రమార్కుల గొడ్డలి వేటకు గురవుతున్నాయి. నీలిగుంట గ్రామానికి చెందిన కొంతమంది వ్యక్తులు ఒక ముఠాగా ఏర్పడి, నీలగిరి చెట్లతను యథేచ్ఛగా నరికివేస్తున్నారు. వీటిని రాత్రి వేళల్లో కలప డిపోలకు, పేపర్ మిల్లులకు తరలిస్తున్నారు.

బోడపాలెం, నీలిగుంట మధ్య పట్టాలమ్మ గుడి కొండ ప్రాంతంలో అటవీ శాఖ ఆధ్వర్యంలో చాలా ఏళ్ల క్రితం వందిలాది ఎకరాల్లో యూకలిప్టస్ మొక్కలు నాటారు. కాలక్రమేణా ఇవి ఏపుగా పెరిగి, చెట్లుగా ఎదిగాయి. ఇక్కడ టేకు ప్లాంటేషన్ కూడా వుంది. ఈ నేపథ్యంలో మూడు నెలల నుంచి నీలగిరి ప్లాంటేషన్‌లో అక్రమంగా చెట్లు మాయం అవుతున్నాయి. నీలిగుంట గ్రామానికి చెందిన ముగ్గురు వ్యక్తులు, కొంతమంది కూలీలను ఏర్పాటు చేసుకుని రోజూ పగటిపూట చెట్లు నరికిస్తున్నారు. రాత్రి వేళల్లో ట్రాక్టర్లలోకి లోడింగ్ చేసి పేపరు మిల్లులకు రవాణా చేస్తున్నట్టు తెలిసింది. వీరు ఎప్పటి నుంచో యూకలిప్టస్ కలప వ్యాపారం చేస్తున్నారు. గతంలో జిరాయితీ, డి.పట్టా భూముల్లో యూకలిప్టస్ తోటలను కొనుగోలు చేసి, కలపను పేపర్ మిల్లులకు సరఫరా చేసేవారు. ఇప్పుడు వారి కన్ను అటవీ భూముల్లోని నీలగిరి తోటలపై పడింది. ఇప్పటి వరకు సుమారు పది ఎకరాల్లో నీలగిరి చెట్లను నరికివేసినట్టు తెలిసింది. ఈ విషయం అటవీ శాఖ అధికారుల దృష్టికి వచ్చినప్పటికీ తమకేమీ పట్టనట్టుగా వ్యవహరిస్తున్నారని కొంతమంది స్థానికులు ఆరోపిస్తున్నారు. కలప అక్రమార్కుల నుంచి అటవీ శాఖ అధికారులకు నెలవారీ మామూళ్లు అందుతున్నాయని చెబుతున్నారు. కాగా అటవీ ప్రాంతంలో యూకలిప్టస్ చెట్లు నరికి, వాటిని అమ్మగా వచ్చిన డబ్బులతో సదరు వ్యక్తులు ఇటీవల పది ఎకరాల భూమి కొనుగోలు చేసినట్టు స్థానికులు చెబుతున్నారు. నీలగిరి చెట్లతోపాటు అప్పుడప్పుడు టేకు చెట్లను కూడా నరికివేసి, దుంగలను తరలించుకుపోతున్నట్టు తెలిసింది.

కాగా బోడపాలెం, నీలిగుంట అటవీ ప్రాంతంలో యూకలిప్టస్ చెట్లు అక్రమంగా నరికివేయడంపై నర్సీపట్నం డీఎఫ్‌వోకు ఫిర్యాదు చేసినట్టు టీడీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి లాలం కాశీనాయుడు తెలిపారు. దీనిపై విచారణ చేపట్టి, నిర్లక్ష్యంగా వ్యవహరించిన అటవీ శాఖ సిబ్బందిపై చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ విషయంలో అధికారులు వెంటనే స్పందించకపోతే మంత్రి అనిత దృష్టికి తీసుకెళ్తానన్నారు. కాగా బోడపాలెం, నీలిగుంట అటవీ ప్రాంతంలో అక్రమంగా యూకలిప్టస్ చెట్ల నరికివేతపై ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్ అప్పారావును 'ఆంధ్రజ్యోతి' వివరణ కోరగా.. ప్లాంటేషన్‌ను పరిశీలించన తర్వాత సిబ్బందిపై చర్యలు తీసుకుంటామని చెప్పారు.



చెట్లను నరికివేసి, రవాణాకు సిద్ధం చేసిన యూకలిప్టస్ దుంగలు

మునిగిన వడ్డాది కాజ్‌వే

- పాత వంతెనపై ట్రాఫిక్ జామ్

బుచ్చెయ్యపేట, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి): పెద్దేరు జలాశయం నుంచి శనివారం అర్ధరాత్రి నీటిని విడుదల చేయడంతో వడ్డాది వద్ద కాజ్‌వే మునిగిపోయింది. దీంతో వాహనాల రాకపోకలు నిలిపివేశారు. ప్రత్యామ్నాయంగా ద్విచక్రవాహనాలు, ఆటోలు, వ్యాన్లు, కార్లువంటి తేలికపాటి వాహనాలను వడ్డాది వద్ద వున్న పాత వంతెన మీదుగా మళ్లించారు. ఆదివారం వడ్డాది సంత కావడంతో వాహనాలు అధికంగా వచ్చాయి. వంతెన ఇరుకుగా వుండడం, ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించేందుకు పోలీసులు లేకపోవడంతో పలుమార్లు వాహనాల రాకపోకలు స్తంభించిపోయాయి. దీంతో ప్రయాణికులు ఇబ్బంది పడ్డారు.



కాజ్‌వేపై నుంచి ప్రవహిస్తున్న వరద నీరు. (ఇన్‌సెట్‌లో) వడ్డాది వంతెనపై స్తంభించిన ట్రాఫిక్

పాల కేంద్రాల వద్ద రైతులు ధర్నా



ఎస్.రాయవరం మండలం ధర్మవరం అగ్రహారం పాల కేంద్రం వద్ద నిరసన తెలుపుతున్న రైతులు

విశాఖ డెయిరీ యాజమాన్యం రెండు, మూడు రోజుల్లో ఆవు పాలకు పాత ధరలను ప్రకటించకపోతే డెయిరీ ప్రధాన కార్యాలయాన్ని ముట్టడిస్తామని రైతులు హెచ్చరించారు. ఆదివారం ఉదయం చీడికాడ మండలం దండిసురవరం, ఎస్.రాయవరం మండలం ధర్మవరం అగ్రహారంలోని విశాఖ డెయిరీ పాల సేకరణ కేంద్రాల ఎదుట ధర్నా చేశారు. వీరికి ప్రజాప్రతినిధులతోపాటు టీడీపీ, సీపీఎం నాయకులు మద్దతు ప్రకటించారు.

-వివరాలు జోన్ పేజీల్లో..

గ్రావెల్ దందా.. రాజకీయ అండ

గంగవరంలో ఆగని అక్రమ తవ్వకాలు

- పేదల ఇళ్ల స్థలాల లేఅవుట్లు ధ్వంసం
- 10-15 అడుగుల లోతు గోతులు
- వెదుళ్లరవ, కొత్తూరు ప్రాంతాల్లో స్టాక్ పాయింట్లు
- గాజువాక, అగనంపూడి, పరవాడ పారిశ్రామిక ప్రాంతాలకు తరలింపు
- గతంలో వైసీపీలో ఉన్న అక్రమార్కులు
- ఎన్నికల ముందు పలువురు జనసేనలో చేరిక
- కూటమి అధికారంలోకి రావడంతో తవ్వకాలు కొనసాగింపు
- చోద్యం చూస్తున్న వీఎంఆర్‌డీఏ, రెవెన్యూ, మైనింగ్ అధికారులు



గంగవరం రెవెన్యూ పరిధిలో గ్రావెల్ తవ్వకాలు జరుగుతున్న ఇళ్ల స్థలాల లేఅవుట్

సబ్బవరం, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి): **మహా విశాఖ నగరపాలక సంస్థ (జీవీఎంసీ) పరిధిలోని సబ్బవరం మండలం గంగవరంలో గ్రావెల్ అక్రమ తవ్వకాలు యథేచ్ఛగా సాగుతున్నాయి. జీవీఎంసీ పరిధిలోని లబ్ధిదారులకు పక్కా ఇళ్ల నిర్మాణం కోసం అభివృద్ధి చేసిన లేఅవుట్లను గ్రావెల్ తవ్వకాలతో గుల్ల చేస్తున్నారు. గ్రావెల్ అక్రమ తవ్వకందారుల్లో పలువురు గత ఎన్నికల ముందు జనసేన పార్టీలో చేరారు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం అధికారంలో వుండడంతో తమ దందాను యథావిధిగా కొనసాగిస్తున్నారు. వీరికి కొంతమంది అధికారులు, సిబ్బంది అండదండలు వున్నాయన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి.**



ఇటీవల కురిసిన వర్షాలకు ముందు గ్రావెల్ తవ్వకంతో చెరువును తలపిస్తున్న గోతులు

మహా విశాఖ నగరపాలక సంస్థ పరిధిలో సొంత ఇళ్లు లేని వారి కోసం గత ప్రభుత్వ హయాంలో సబ్బవరం మండలం గంగవరం, నంగినారపాడు, గొల్లలపాలెం ప్రాంతాల్లో వీఎంఆర్‌డీఏ అధికారులు లేఅవుట్లు వేసి, పట్టాలు పంపిణీ చేశారు. తరువాత లబ్ధిదారులకు పక్కా ఇళ్లు మంజూరు చేసి, నిర్మాణ పనులను కాంట్రాక్టర్లకు అప్పగించారు. అయితే లేఅవుట్లలో పలుచోట్ల ఇళ్ల నిర్మాణాలు చేపట్టలేదు. ఇక్కడ నాణ్యమైన గ్రావెల్ వుండడంతో స్థానికంగా వుండే కొంతమంది వ్యక్తులు రాజకీయ అండదండలతో రెండేళ్ల క్రితమే

... మిగతా 8వ పేజీలో

నిండిన పెద్దేరు... గేట్లు ఎత్తివేత



నిండుకుండలా పెద్దేరు జలాశయం

మాడుగుల రూరల్, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పెద్దేరు జలాశయం నీటిమట్టం మరోసారి గరిష్ఠస్థాయికి చేరుకుంది. దీంతో అధికారులు స్పిల్‌గేట్లు గేట్లు ఎత్తారు. రిజర్వాయర్ పూర్తిస్థాయి నీటిమట్టం 137 మీటర్లు కాగా, శనివారం రాత్రి 234 క్యూసెక్కుల వరదతో 136.50 మీటర్లకి చేరింది. ప్రాజెక్టు అధికారులు అప్రమత్తమై రాత్రి పది గంటల సమయంలో ఒక గేటు ఎత్తి 400 క్యూసెక్కుల నీటిని దిగువకు విడిచిపెట్టారు. ఆదివారం తెల్లవారుజామున ఐదు గంటలకు గేటు మూసేశారు. సాయంత్రానికి నీటిమట్టం 136.2 మీటర్లు వుందని ఏఈ సుధాకరరెడ్డి తెలిపారు.

టీడీపీ, బీజేపీ మధ్య ఆధిపత్య పోరు

- నునపర్తిలో పల్లె పండుగకు పోటాపోటీగా ఏర్పాట్లు
- విషయం తెలిసి.. కార్యక్రమాన్ని రద్దు చేసుకున్న ఎమ్మెల్యే విజయకుమార్

అచ్యుతాపురం, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి): కూటమిలోని తెలుగుదేశం, బీజేపీ నాయకుల మధ్య ఆధిపత్య పోరు కారణంగా మండలంలోని నునపర్తిలో ఆదివారం జరగాల్సిన పల్లె పండుగ కార్యక్రమం రద్దయ్యింది. ఇందుకు సంబంధించి వివరాలిలా వున్నాయి. మండలంలోని రామన్నపాలెం, ఆవ రాజాం, నునపర్తి, రాజానపాలెం, దోసూరుల్లో ఆదివారం 'పల్లె పండుగ' కార్యక్రమాలు జరగాల్సి వుంది. స్థానిక ఎమ్మెల్యే విజయకుమార్‌తోపాటు అనకాపల్లి ఎంపీ సీఎం రమేశ్ పాల్గొంటారని స్థానిక నాయకులు ప్రకటించారు. ఎంపీ రమేశ్ ఉదయం రామన్నపాలెంలో జరిగిన కార్యక్రమానికి హాజరై, తరువాత దేవరాపల్లి వెళ్లిపోయారు. ఎమ్మెల్యే విజయకుమార్, మాజీ ఎమ్మెల్సీ పప్పల చలపతిరావు మిగిలిన వాటిల్లో పాల్గొనాలి. ఆవరాజాంలో కార్యక్రమం పూర్తయిన తర్వాత నునపర్తి వెళ్లాలి. కానీ అక్కడ టీడీపీ, బీజేపీ వర్గాల

... మిగతా 8వ పేజీలో

మంత్రి అనిత నివాసంలో హోమం


హోమం చేస్తున్న హోం శాఖ మంత్రి అనిత

నక్కపల్లి, అక్టోబరు 20: రాష్ట్ర హోం శాఖ మంత్రి వంగలపూడి అనిత ఆదివారం స్థానికంగా వున్న తన నివాస గృహం వద్ద రాజశ్యామలా సహిత లక్ష్మీనరసింహస్వామి హోమాన్ని నిర్వహించారు. హైదరాబాద్, విశాఖపట్నం తదితర ప్రాంతాలకు చెందిన వేదపండితుల బృందం ఈ హోమాన్ని జరిపించారు. రాష్ట్ర ప్రజలు సుభిక్షంగా వుండాలన్న సంకల్పంతో ఈ హోమం నిర్వహించామని హోం శాఖ మంత్రి అనిత చెప్పారు. మధ్యాహ్నం పూర్ణాహుతి కార్యక్రమం జరిగింది. పలువురికి ప్రసాదాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు కొప్పిశెట్టి వెంకటేశ్, ఉపమాక దేవస్థానం మాజీ చైర్మన్ కొప్పిశెట్టి బుజ్జి పాల్గొన్నారు.

వైసీపీ నుంచి జనసేనలో చేరిక


వైసీపీ నుంచి జనసేనలో చేరిన వారితో ఎమ్మెల్యే సుందరపు విజయకుమార్

అచ్యుతాపురం/రాంబిల్లి, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి): రాంబిల్లి మండలం కొత్తపేట నుంచి వైసీపీ నాయకులు, కార్యకర్తలు ఆదివారం అచ్యుతాపురంలో ఎమ్మెల్యే సుందరపు విజయకుమార్ సమక్షంలో జనసేన పార్టీలో చేరారు. వీరందరికీ విజయకుమార్ పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. జనసేనలో చేరిన వారిలో మాడెం రాజబాబు, బొడ్డు నారాయణ రావు, మాడెం అయ్యప్ప, బొడ్డు ప్రసాద్, జల్లి అప్పలరెడ్డి, జోరెగల రాంబాబు తదితరులున్నారు. ఈ కార్యక్రమంలో జనసేన రాంబిల్లి మండల అధ్యక్షుడు పప్పల నూకన్నదొర, కడగల పైడిరాజు, ధర్మాల సత్యనారాయణ పాల్గొన్నారు.

ఘనంగా గ్యార్మీ షరీఫ్ ఉర్సు ఉత్సవం


గుర్రంపై ఊరేగింపు చేపడుతున్న దృశ్యం

నక్కపల్లి, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పలు ముస్లిం గ్రామాల్లో ఆదివారం ఘనంగా గ్యార్మీ షరీఫ్ ఉర్సు ఉత్సవం ఘనంగా జరిగింది. పెదబోదిగల్లం, చినబోదిగల్లం, అప్పలపాయకరావుపేట, పెదదొడ్డిగల్లు గ్రామాల్లో ముస్లిం సోదరులు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. గ్యార్మీ షరీఫ్ ఉర్సు ఉత్సవం విశిష్టత గురించి ముస్లిం మత పెద్దలు వివరించారు. గ్రామాల్లో పండుగ వాతావరణం నెలకొంది. చందనం పూసిన అశ్వాలతో బావుటాలు ఎగురవేసి ఊరేగించారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం


అచ్యుతాపురం ఉన్నత పాఠశాలలో కలుసుకున్న పూర్వ విద్యార్థులు

అచ్యుతాపురం, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి): స్థానిక హైస్కూల్‌లో 1991-92 విద్యా సంవత్సరంలో పదో తరగతి చదువుకున్న పూర్వ విద్యార్థులు ఆదివారం ఆత్మీయంగా కలుసుకున్నారు. 32 సంవత్సరాల తర్వాత కలుసుకోవడంతో వీరి ఆనందానికి అవధులు లేవు. ఒకరినొకరు ఆలింగనం చేసుకొన్నారు. కుటుంబ క్షేమ సమాచారం, పిల్లల పరిస్థితులు అడిగి తెలుసుకున్నారు. ప్రస్తుత ఆర్థిక పరిస్థితుల గురించి కూడా ఒకరినొకరు అడిగి తెలుసుకున్నారు. అప్పటి పాఠశాల హెచ్‌ఎం కేవీ గౌరీపతిని ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో కూండ్రపు వెంకటరావు, పుర్రె శ్రీనివాస యాదవ్, ధర్మిరెడ్డి చిన రమణ, మేరుగు వెంకటరావు, పవన్ కుమార్, కోలా రమాదేవి, హైమావతి, చిదంబరం తదితరులు పాల్గొన్నారు.

సహచరుల కుటుంబాలకు చేయూత


పిల్లలకు ఎఫ్‌డీ బాండ్లను అందజేస్తున్న సహచరులు

అచ్యుతాపురం, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఉన్నత పాఠశాలలో ఇరవై ఏళ్ల క్రితం అంతా కలిసి పదో తరగతి చదువుకున్నారు. తర్వాత వారంతా వేర్వేరు రంగాల్లో సెటిల్ అయ్యారు. వీరిలో చొప్పా బాలకృష్ణ, అల్లు సంధ్యారాణి వేర్వేరు కారణాలతో మృతి చెందారు. వీరి పిల్లలకు ఆర్థిక సహాయం చేయాలని 2003-2004 బ్యాచ్ నిర్ణయించారు. వారంతా విరాళాలు వేసుకొని బాలకృష్ణ పిల్లల పేరున రూ.50 వేలు, సంధ్యారాణి పిల్లల పేరున రూ.25 వేలు ఫిక్స్‌డు డిపాజిట్ చేసి బాండ్లను ఆదివారం పాఠశాల ఆవరణలో కుటుంబ సభ్యులకు అందజేశారు.

అభిజిత్ లేఆఫ్ ఎత్తివేయాలి



ఆందోళన చేస్తున్న సీపీఎం శ్రేణులు

అచ్యుతాపురం, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి): అభిజిత్ కంపెనీలో లేఆఫ్‌ని ఎత్తివేయాలని సీఐటీయూ మండల కార్యదర్శి కూండ్రపు సోమునాయుడు డిమాండ్ చేశారు. ఆదివారం అచ్యుతాపురం జంక్షన్‌లో జరిగిన నిరసన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ లాభాలు వచ్చినంత కాలం కార్మికుల రక్తాన్ని పీల్చిన కర్మాగార యాజమాన్యం ఇప్పుడు నష్టం వస్తుందన్న పేరుతో లేఆఫ్ ప్రకటించటం అన్యాయమన్నారు. లేఆఫ్ ఉన్నంత కాలం పూర్తి జీతం ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు. కూటమి ప్రభుత్వం పరిశీలన జరిపి రోడ్డున పడిన వెయ్యి మంది కార్మికులను ఆదుకోవాలన్నారు.

ఎలమంచిలిలో డ్రైనేజీలు అధ్వానం

మునిసిపల్ అధికారుల నిర్లక్ష్యం

వర్షం పడితే కొన్ని రోడ్లు చెరువులే..

రోడ్లు, డ్రైనేజీలు ఆధునికీకరణ చేయాలంటున్న పట్టణవాసులు


రైల్వే స్టేషన్ రోడ్డులో డ్రైనేజీ దుస్థితి

ఎలమంచిలి, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి):

ఎలమంచిలి.. పేరుకు మునిసిపాలిటీ.. కానీ పెద్ద పల్లెటూరులా చేసేశారు మునిసిపల్ అధికారులు.. గ్రామమైనా.. పట్టణమైనా.. నగరమైనా మౌలిక సదుపాయలకు అధికారులు ప్రాధాన్యం ఇవ్వాలి. కానీ ఇక్కడ అధికారులు ఆ దిశగా ఆలోచన చేయడం లేదు. మునిసిపాలిటీ ఏర్పడి 12 ఏళ్లు అయినా పట్టణంలో ఇప్పటివరకు మౌలిక సదుపాయాలు కల్పించేందుకు ప్రణాళికలు రూపొందించలేదంటే ఇక్కడ అధికారుల తీరు ఇట్టే అర్థం అవుతోంది. అంతేకాదు ఇక్కడ సంపన్నులు ఉండే వీధుల్లో డ్రైనేజీలు, రోడ్లు కాస్త మెరుగ్గానే ఉంటాయి కానీ పేదోళ్లు, మధ్యతరగతి ఉండే వీధులు పరిస్థితి దారుణంగా ఉంటాయి. ఈ నేపథ్యంలో పట్టణంలోని రోడ్లు, డ్రైనేజీల దుస్థితిపై ప్రత్యేక కథనం.

ఎలమంచిలి మునిసిపల్ అధికారులు, పాలకుల నిర్లక్ష్యం కారణంగా పట్టణంలో కొన్ని ప్రధాన ప్రాంతాల్లో అభివృద్ధి ఎక్కడ వేసిన గొంగలి అక్కడే అన్న చందంగా తయారైంది. పలు ప్రాంతాల్లోని పట్టణ ప్రధాన డ్రైనేజీలు, రోడ్లు పదేళ్ల నుంచి ఆధునికీకరణకు నోచుకోలేదు. చేపట్టిన రోడ్డు నిర్మాణాల వద్ద డ్రైనేజీలు నిర్మించకపోవడంతో వర్షం నీరంతా రోడ్డుపైనే నిలిచిపోతున్నది. రహదారులు నిర్మించే ముందు డ్రైనేజీలు ఆధునికీకరణ చేయాల్సి ఉన్నప్పటికీ ఇంజనీరింగ్ అధికారులు ఆ దిశగా పనులు చేపట్టడం లేదు. చేసిన పనులు కూడా తూతూమంత్రంగా చేస్తున్నారని పట్టణవాసులు ఆరోపిస్తున్నారు. ఇటువంటి పనుల వల్ల వర్షం పడినప్పుడల్లా పట్టణ ప్రజల రాకపోకలకు అవస్థలు పడుతున్నారు.


డ్రైనేజీలు లేని పెద్దపల్లి రోడ్డుపై నిలిచిన వర్షం, వాడుక నీరు


పట్టణంలోని కాకివానివీధిలోని డ్రైనేజీ దుస్థితి

ప్రధానంగా ప్రముఖులు, సంపన్నులు ఉండే ప్రాంతాల్లోని రోడ్లు, డ్రైనేజీలు ఆధునికీకరణ చేస్తున్నారని, పేదలు నివాసం ఉండే ప్రాంతాల పట్ల అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారని పట్టణవాసులు ఆరోపిస్తున్నారు. పేదలు నివాసం ఉండే కాకివానివీధి రోడ్డు పొడవునా డ్రైనేజీ పదేళ్లుగా దారుణంగా తయారై దుర్వాసన వెదజల్లుతున్నా సరే పట్టించుకున్న పాపాన పోలేదని స్థానికులు విమర్శిస్తున్నారు. ఈ రోడ్డు మీదుగా నిత్యం వేలాది మంది రాకపోకలు సాగిస్తూ తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. అలాగే కొత్తపేట సీతారాముల ఆలయం ముందు రోడ్డు పిక్కలు లేచిపోయి వాహనాలతోపాటు పాదచారులు సైతం నడవలేని దుస్థితిలో రోడ్డు తయారైనా సరే మునిసిపల్ అధికారులు అటు వైపు కన్నెత్తి చూడడం లేదు. రైల్వే స్టేషన్ రోడ్డు, గాంధీనగర్, యర్రవరం, కొత్తపేట, ఏఎస్ఆర్ కాలనీ ప్రాంతాల్లోని డ్రైనేజీలు దారుణంగా తయారయ్యాయి.

ఎలమంచిలి-పెదపల్లి రోడ్డును లక్షలాది రూపాయలతో నిర్మించిన అధికారులు డ్రైనేజీ నిర్మించకపోవడంతో చినుకు పడితే చాలు ఆ రోడ్డు పిల్ల చెరువును తలపిస్తున్నది. ఇక వాహనదారుల అవస్థలు వర్ణనాతీతం. మునిసిపల్ అధికారులు పేదలు నివాసముండే ప్రాంతాలపై దృష్టి సారించాలని పట్టణవాసులు కోరుతున్నారు. పట్టణంలో ప్రతీ వీధిలో డ్రైనేజీలు నిర్మించి మురుగు, వర్షపు నీరు పోయే విధంగా చర్యలు తీసుకోవాలని పట్టణవాసులు కోరుతున్నారు.

టీడీపీ సభ్యత్వ నమోదు గతం కంటే అధిగమించాలి

నియోజకవర్గ ఇన్‌చార్జి ప్రగడ నాగేశ్వరరావు

ఎలమంచిలి, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి): తెలుగుదేశం పార్టీ అధిష్ఠానం పిలుపు మేరకు టీడీపీ సభ్యత్వ నమోదు గతంకంటే అధిగమించాలని పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి ప్రగడ నాగేశ్వరరావు పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. ఆదివారం స్థానిక టీడీపీ కార్యాలయంలో జరిగిన నియోజకవర్గ స్థాయి సమావేశంలో ఆయన మాట్లాడారు. ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్‌లు ప్రధాని మోదీ సహకారంతో రాష్ట్రాభివృద్ధికి ముందుకు సాగుతున్నారన్నారు. సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు. పార్టీ కోసం శ్రమించిన ప్రతి ఒక్కరికి సముచిత స్థానం ఉంటుందని సీఎం చంద్రబాబు భరోసా ఇచ్చారన్నారు. మాజీ ఎమ్మెల్సీ పప్పల చలపతిరావు మాట్లాడుతూ పార్టీ శ్రేణులంతా కలిసికట్టుగా రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో సత్తా చాటేందుకు సాగాలన్నారు. గ్రామాల్లో సమస్యల పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ప్రగడ నాగేశ్వరరావు

గుర్తింపు లేదని నేతలు, కార్యకర్తలు అసంతృప్తి

నియోజకవర్గ స్థాయి సమావేశంలో పలువురు నేతలు, కార్యకర్తలు మాట్లాడుతూ రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం వచ్చినా నియోజకవర్గంలో టీడీపీ శ్రేణులకు సరైన గుర్తింపు లేకుండా పోయిందని వాపోయారు. పదవులు లేకపోతే గుర్తింపు ఇవ్వడం లేదని అసంతృప్తి వ్యక్తంచేశారు. టీడీపీ శ్రేణులను టార్గెట్‌గా చేసుకొని కేసులు పెడుతున్నారని ఆరోపించారు. పట్టణంలో జరిగిన అభివృద్ధి కార్యక్రమం శిలాఫలకంపై నియోజకవర్గ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్సీ పేర్లు పెట్టలేదని, ఎంతో అవమానకరంగా ఉందని కార్యకర్తలు ఆవేదన వ్యక్తంచేశారు. టీడీపీ శ్రేణులకు సరైన గుర్తింపు ఇచ్చేలా అధిష్ఠానం దృష్టికి తీసుకువెళ్లాలని సమావేశంలో తేల్చి చెప్పారు. ఈ సమావేశంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి దూళి రంగనాయకులు, పట్టణ అధ్యక్ష, కార్యదర్శులు గొర్లె నానాజీ, ఆడారి రమణబాబు, జిల్లా నేతలు కొఠారు సాంబ, రాజాన నాగేశ్వరరావు, ఇత్తంశెట్టి సన్యాసినాయుడు, కాండ్రకోట చిరంజీవి, ఇత్తంశెట్టి రాజు, రాజాన వెంకునాయుడు, మజ్జి రామకృష్ణ, కరణం రవి, పందూరి శ్రీను, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

వసతి గృహాల్లో సమస్యల పరిష్కారానికి చర్యలు

» ఎలమంచిలి సివిల్ కోర్టు సీనియర్ జడ్జి పి.విజయ

పాయకరావుపేట, అక్టోబరు 20 : వసతి గృహాల్లో సమస్యలుంటే పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని ఎలమంచిలి కోర్టు సీనియర్ సివిల్ జడ్జి పి.విజయ తెలిపారు. ఆదివారం స్థానిక ఎస్సీ బాలురు-1, 2, బాలికలు-1, 2తోపాటు బీసీ కాలేజి బాలురు, బాలికల వసతి గృహాలను ఆమె ఆకస్మికంగా తనిఖీచేశారు. ఈ సందర్భంగా ఆయా వసతి గృహాల్లో వసతులు, రికార్డులు పరిశీలించారు. అదేవిధంగా మెనూ, వంట గది, మరుగుదొడ్లు, స్టోర్, స్టాక్ రూమ్స్ తనిఖీ చేశారు. అలాగే మెనూ సక్రమంగా పెడుతున్నారా.. లేదా.. అని విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. సమస్యలు ఉంటే తెలియజేయాలని, వాటిని వెంటనే పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఆమె వెంట ప్యానెల్ అడ్వకేట్ టి.నూకరాజు, ఎస్ఐ జె.పురుషోత్తం, కోర్టు సిబ్బంది, వసతి గృహాల వార్డెన్లు ఉన్నారు.


పాయకరావుపేట: విద్యార్థులతో మాట్లాడుతున్న జడ్జి పి.విజయ

కేజీబీవీని తనిఖీ చేసిన జడ్జి

నక్కపల్లి: స్థానిక కేజీబీవీని ఆదివారం సాయంత్రం ఎలమంచిలి కోర్టు సీనియర్ సివిల్ జడ్జి పి.విజయ తనిఖీ చేశారు. స్కూల్ రికార్డులు, బాలికలకు పెడుతున్న భోజనాన్ని పరిశీలించారు. బాలికలతో మాట్లాడారు. ఎటువంటి అసౌకర్యం లేదని బాలికలు చెప్పారు. డిజిటల్ క్లాస్ రూములను జడ్జి పరిశీలించారు. డార్మిటరీ, కిచెన్, వాష్‌రూమ్‌లు, స్టోర్‌రూమ్‌ను తనిఖీ చేసి సంతృప్తి వ్యక్తం చేశారు. టెన్త్‌లో ఉత్తమ ఫలితాలు సాధించేందుకు పిల్లలకు ప్రత్యేక శిక్షణ ఇస్తున్నామని కేజీబీవీ ఎస్‌వో సలీమా చెప్పారు.


తిమ్మాపురం కేజీబీవీ విద్యార్థినులతో మాట్లాడుతున్న జడ్జి పి. విజయ

తిమ్మాపురం కేజీబీవీ, ఎస్.రాయవరం హాస్టళ్ల తనిఖీ

ఎస్.రాయవరం: మండలంలోని తిమ్మాపురం కేజీబీవీ, ఎస్.రాయవరం, రేవుపోలవరం బీసీ బాలుర వసతి గృహాలను ఎలమంచిలి కోర్టు సీనియర్ సివిల్ జడ్జి పి.విజయ ఆదివారం సందర్శించారు. ఈ సందర్భంగా జడ్జి విజయ ఆయా హాస్టళ్ల విద్యార్థిని, విద్యార్థులతో మాట్లాడారు. వారి సమస్యలు, మెనూ ప్రకారం భోజనం, చదువు తదితర అంశాల గురించి అడిగి తెలుసుకున్నారు. ఎవరికైన వ్యక్తిగత సమస్య వస్తే టోల్ ఫ్రీ నంబర్‌కు ఫోన్ చేయవచ్చునని ఆమె విద్యార్థులకు సూచించారు. కార్యక్రమంలో న్యాయవాది టి. నూకరాజు తదితరులు పాల్గొన్నారు.

ధర్మవరం అగ్రహారంలో పాడి రైతుల ఆందోళన

» ఆవు పాలు ధర తగ్గించడం అన్యాయం

» 29న విశాఖ డెయిరీ ప్రధాన కార్యాలయం వద్ద ధర్నా

» రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి అప్పలరాజు

ఎస్.రాయవరం. అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి): విశాఖ డెయిరీ యాజమాన్యం ఆవు పాలు ధర తగ్గించడంపై పాడి రైతులు ఆదివారం ధర్మవరం అగ్రహారంలోని పాల సేకరణ కేంద్రం వద్ద ఆందోళన చేశారు. ఈ సందర్భంగా రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం. అప్పలరాజు మాట్లాడుతూ.. విశాఖ డెయిరీ యాజమాన్యం ఎన్నడూ లేని విధంగా ఆవు పాలు ధర ఒకేసారి తగ్గించడం దారుణమన్నారు. పెరిగిన మేత, దాణా ఖర్చుల కారణంగా డెయిరీ ఇస్తున్న పాల ధర గిట్టుబాటు కాక రైతులు తీవ్రంగా నష్టపోతున్నారన్నారు. విశాఖ డెయిరీ తమ నిర్ణయాన్ని ఉపసంహరించువాలని ఆయన డిమాండ్ చేశారు. ఆవు పాలు ధర తగ్గించడాన్ని నిరసిస్తూ ఈనెల 29న ఉదయం గాజువాకలోని విశాఖ డెయిరీ ప్రధాన కార్యాలయం వద్ద మహాధర్నా నిర్వహిస్తామని అప్పలరాజు ప్రకటించారు. అనంతరం పాల ధరను వెంటనే పెంచాలని కోరుతూ పాడి రైతులతో కలిసి ఆయన పాల సంఘం అధ్యక్షుడు, వేతన కార్యదర్శులకు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో పి. శ్రీను, బి. నరసింగరావు, జి. నాయుడు, కె. సూర్యనారాయణ, పి. నూకరాజు, తదితరులు పాల్గొన్నారు.


పాల కేంద్రం కార్యదర్శికి వినతిపత్రాన్ని అందజేస్తున్న పాడి రైతులు

రామారాయుడుపాలెం రోడ్డు కల్వర్టుకు మరమ్మతులు

» ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

ఎలమంచిలి, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి):మునిసిపాలిటీలోని రామారాయుడుపాలెం వార్డుకు వెళ్లే రోడ్డు వద్ద దెబ్బతిన్న కల్వర్టుకు మునిసిపల్ అధికారులు మరమ్మతులు చేపట్టారు. శుక్రవారం 'ఆంధ్రజ్యోతి'లో 'ప్రమాద ప్రయాణం' శీర్షికన ప్రచురితమైన కథనానికి మునిసిపల్ అధికారులు వెంటనే స్పందించారు. ఈ రోడ్డు వద్ద కల్వర్టు దెబ్బతినడంతో మహిళలు, విద్యార్థులు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్న విషయం విదితమే. పత్రికలో కథనం రావడంతో వెనువెంటనే ఎక్స్‌కవేటర్ల సహాయంతో కల్వర్టు కింద సాగునీరు పోయేందుకు తూరలు ఏర్పాటు చేసి, తాత్కాలిక పనులు చేపట్టి పూర్తి చేశారు. మునిసిపల్ చైర్‌పర్సన్ రమాకుమారి స్వయంగా పనులు జరిగిన ప్రదేశానికి వచ్చి పరిశీలించారు. ఏఈ గణపతి సబ్బారావు ఆధ్వర్యంలో పనులు పూర్తి చేశారు. నెలలు తరబడి ఉన్న ఈ సమస్యను పరిష్కరించిన 'ఆంధ్రజ్యోతి' స్థానికులు అభినందించారు.


కల్వర్టు వద్ద తూరలు వేస్తున్న దృశ్యం

పీవీ రమణకు పలువురు నివాళి

మునగపాక (తుమ్మపాల), అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి): నిరాడంబరానికి నిలువెత్తు నిదర్శనంగా నిలిచిన కమ్యూనిస్టు నేత స్వర్గీయ పీవీ రమణకు పలువురు నివాళులర్పించారు. స్థానిక పీవీ రమణ విగ్రహం వద్ద ఆదివారం 105వ జయంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన విగ్రహానికి కుటుంబసభ్యులు, అభిమానులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో మొల్లేటి సత్యనారాయణ, బద్దెం సూర్యనారాయణ, దాడి మురిలినాయుడు, ఆళ్ల మహేశ్వరరావు, దాడి శివ, పూసర్ల సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు. అలాగే కమ్యూనిస్టు నేత స్వర్గీయ పీవీ రమణ జయంతి వేడుకల్లో సీఐటీయూ నాయకులు పాల్గొన్నారు. కార్మిక, కర్షక రంగాలకు ఆయన అందించిన సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో సీపీఎం అనుబంధ సంఘాలు నాయకులు కర్రి అప్పారావు, గనిశెట్టి సత్యనారాయణ, ఎస్.బ్రహ్మాజీ, కాండ్రేగుల రాము తదితరులు పాల్గొన్నారు.

నక్కపల్లిలో సంకట చతుర్థి పూజలు

నక్కపల్లి, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి): స్థానిక విఘ్నేశ్వరస్వామి ఆలయంలో ఆదివారం సంకట చతుర్థి తిథి సందర్భంగా ప్రత్యేక పూజలు చేశారు. తొలుత స్వామివారి ఉత్సవ మూర్తికి వేదపండితులు ప్రసాదాచార్యులు, శేషాచార్యులు,అప్పలాచార్యులు పంచామృతాభిషేకం చేశారు. అనంతరం అలంకరణ, ధూప, దీప,నైవేద్య నీరాజన మంత్ర పుష్పాలు సమర్పించారు. ఉపమాక దేవస్థానం మాజీ చైర్మన్ పెంకులరాజు ముఖ్యఅతిథిగా హాజరై స్వామి వారికి పూజలు చేశారు.

అనాథ శరణాలయానికి నూతన వస్త్రాలు వితరణ


ఎలమంచిలి, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి): ఎలమంచిలి కొక్కిరాపల్లి అనాథ శరణాలయానికి రాంబిల్లి వీర్వో సుబ్రహ్మణ్యం కుమారుని పుట్టినరోజు సందర్భంగా ఆదివారం నూతన వస్త్రాలను వితరణ అందజేశారు. వీటిని అనాథ శరణాలయంలోని పిల్లలకు అందజేసి, తన ఉదారతను చాటుకున్నారు.

తులంన్నర బంగారం చోరీ

పాయకరావుపేట, అక్టోబరు 20 : పట్టణంలోని జీవీఆర్.నగర్‌లో ఆదివారం రాత్రి నడిచి వెళుతున్న మహిళ మెడలో ఉన్న సుమారు తులంన్నర బంగారం చైనును గుర్తు తెలియని వ్యక్తి లాక్కుని ద్విచక్రవాహనంపై పరారయ్యాడు. పోలీసులు అందించిన వివరాలిలా ఉన్నాయి.

పాయకరావుపేట పట్టణంలో మెయిన్‌రోడ్డును ఆనుకుని ఉన్న జీవీఆర్.నగర్‌లో నివాసముంటున్న యు.ఇందిరాదేవి నక్కపల్లి మండలం గొడిచెర్ల ప్రభుత్వ పాఠశాలలో ఉపాధ్యాయురాలిగా పనిచేస్తున్నారు. ఆదివారం రాత్రి మెయిన్ రోడ్డులో సరుకులు కొనుగోలు చేసి ఇంటికి నడిచి వెళుతుండగా ద్విచక్రవాహనంపై వెనుక వచ్చిన గుర్తు తెలియని వ్యక్తి ఉపాధ్యాయురాలి మెడలో ఉన్న సుమారు తులంన్నర పుస్తెలతాడుని లాక్కుని పరారయ్యాడు. షాక్‌కి గురైన బాధితురాలు వెంటనే తేరుకుని నిందితుడి వెంట పరుగెత్తినా ప్రయోజనం లేకుండా పోయింది. జరిగిన సంఘటనపై ఫిర్యాదు అందుకున్న పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రాజయ్యపేటలో పారిశుధ్య లోపం


కాలువలో పేరుకుపోయిన చెత్త

నక్కపల్లి, అక్టోబరు 20: మండలంలోని రాజయ్యపేట గ్రామంలో పారిశుధ్యపనులు చేపట్టకపోవడం వల్ల కాలువలు కంపు కొడుతున్నాయని గ్రామస్థులు వాపోతున్నారు. మురికి కాలువలను శుభ్రం చేయకపోవడం వల్ల నెలల తరబడి అనేక వ్యర్థాలు, చెత్త,చెదారం కాలువల్లో వుండిపోవడం వల్ల పెంటకుప్పల్లా కనబడుతున్నాయని జనసేన నాయకుడు పిక్కి స్వామి చెప్పారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని కోరారు.

నాతవరంలో సమస్యల రాజ్యం!



గతుకులు, పెచ్చులు ఊడిపోయిన నాతవరం ప్రధాన రహదారి

కనీస సదుపాయాలు కరువు.. అధ్వానంగా ప్రధాన రహదారి

తాగునీటి వనరుల లేమితో వీధుల్లో దాహం కేకలు

ఎక్కడికక్కడే చెత్తాచెదారం.. లోపించిన పారిశుధ్యం

ప్రజల అగచాట్లు.. పట్టించుకోని అధికారులు

మండల కేంద్రం నాతవరంలో సమస్యలు రాజ్యమేలుతున్నాయి. కనీస సదుపాయాలు కరువయ్యాయి. ఎక్కడికక్కడే చెత్త కుప్పలు పేరుకుపోయాయి. రహదారులు అధ్వానంగా తయారయ్యాయి. తాగునీటి వనరుల లేమితో దాహం కేకలు వినిపిస్తున్నాయి.

నాతవరం, అక్టోబరు 20: నాతవరంలో దాదాపు 7665 మంది జనాభా నివసిస్తున్నారు. ఇంత మంది జనాభా ఉన్నప్పటికీ కనీస సదుపాయాలు కల్పించడంలో ప్రజాప్రతినిధులు, అధికారులు శ్రద్ధ చూపించడం లేదు. ప్రధాన రహదారిలో నిత్యం వందలాది వాహనాలు తిరుగుతుంటాయి. నాలుగేళ్లుగా ఈ రోడ్డు గోతులతో దర్శనమిస్తున్నది. మరమ్మతుల కోసం కనీస చర్యలు చేపట్టడం లేదు.

అలాగే గ్రామంలో పూర్తిస్థాయిలో ప్రజలకు తాగునీరు అందటం లేదు. దీంతో తాగునీటి కోసం అవస్థలు పడుతున్నారు. వైఎస్సార్ కాలనీలో సరిపడా తాగునీరు సరాఫరా కాలేదని అక్కడి నివాసితులు ఆందోళన చెందుతున్నారు. అలాగే వైఎస్సార్ కాలనీలో డ్రైనేజీలు లేకపోవడంతో మురుగునీరు ఇళ్ల ముందే నిల్వ ఉంటున్నది. దీంతో దోమల బెడదతో అవస్థలు పడుతున్నామని ప్రజలు వాపోయతున్నారు. అలాగే చాలా వీధులలో కుళాయిలు పని చేయడం లేదని చెబుతున్నారు. చెత్తను రోజు తీసుకెళ్లి నాతవరం బాలుర వసతి గృహం-వారపుసంత మధ్యలో డంపింగ్ చేస్తున్నారని, వర్షాలకు ఈ చెత్త కుళ్లిపోయి వసతిగృహం విద్యార్థులతో పాటు వారపు సంతకు వచ్చేవారు పడరాని పాట్లు పడుతున్నారని గ్రామస్థులు తెలిపారు. ప్రతీ వీధిలో చెత్తను వేయడానికి కుండీలు ఏర్పాటు చేయాలని వారు కోరుతున్నారు.

కళాశాలలో అధ్యాపకుల కొరత

అలాగే ఎన్నో ఏళ్ల తర్వాత నాతవరం హైస్కూల్‌లో ఈ ఏడాది ఎంపీసీ, సీఈసీ గ్రూపులుతోప్రభుత్వ జూనియర్ కాలేజీని ఏర్పాటు చేశారు. ఎంపీపీ గ్రూపులో ఇద్దరు విద్యార్థులు, సీఈసీ గ్రూపులో తొమ్మిది మంది విద్యార్థులు మాత్రమే ఉన్నారని తల్లిదండ్రులు చెబుతున్నారు. ప్రభుత్వ జూనియర్ కాలేజీ ఏర్పాటు చేసినప్పటికీ అధ్యాపకులను నియమించకపోవడంతో ఇక్కడ హైస్కూల్‌లో పనిచేసే ఉపాధ్యాయులతోనే అరకొరగా పాఠాలు బోధిస్తున్నారని వారు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అలాగే అధ్యాపకులు లేకుండా ప్రభుత్వం జూనియర్ కాలేజీ ఏర్పాటు చేసినా ఉపయోగమేమిటని విద్యార్థుల తల్లిదండ్రులు ప్రశ్నిస్తున్నారు.



ఎంపీసీ తరగతి గదిలో ఒకే విద్యార్థి



వైఎస్సార్ కాలనీలో డ్రైనేజీలు లేక ఇళ్ల పక్కనే మురుగు నీటి నిల్వలు

అలాగే వారపు సంతలో ఆశీలు వసూలు చేయడం తప్ప ఇక్కడ వ్యాపారులకు ఒక షెల్టర్ కూడా ఏర్పాటు చేయలేదని, కనీసం తాగునీటి సౌకర్యం కూడా కల్పించలేదని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఆర్టీసీ బస్ షెల్టర్ కూడా లేదని, ప్రయాణికులు ఎండలో ఇబ్బందులు పడుతున్నారని స్థానికులు చెప్పారు. ఇప్పటికైనా సంబంధిత ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి నాతవరంలో కనీస సదుపాయాలు కల్పించాలని, కళాశాలలో అధ్యాపకులను నియమించాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు.



బాలుర వసతిగృహం-వారపు సంత మధ్యలో పేరుకుపోయిన చెత్త కుప్పలు

బస్ షెల్టర్ లేక ఇబ్బందులు



-గొల్లు రాంబాబు, నాతవరం

మండల కేంద్రం నాతవరంలో బస్ షెల్టరు లేదు. దీంతో గమ్యం చేరుకునే బస్సు వచ్చేవరకు ప్రయాణికులు ఎండలోనే ఇబ్బందులు పడుతూ నిరీక్షిస్తున్నారు. నాతవరంలో బస్ షెల్టరు నిర్మించి ప్రయాణికుల కష్టాలు గటెక్కించాలి.

మెయిన్ రోడ్డు మరమ్మతు చేయాలి



శెట్టి శ్రీనువాసు, నాతవరం

మండల కేంద్రంలనే మెయిన్ రోడ్డు అధ్వానంగా ఉంది ఆస్పత్రి వద్ద వాహనదారులు చాలా ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు వెంటనే స్పందించి నాతవరం మెయిన్ రోడ్డుకు మరమ్మతులు చేయాలి



శంకుస్థాపన చేస్తున్న ఎంపీ సీఎం.రమేశ్, ఎమ్మెల్యే బండారు, నాయకులు

మాడుగుల నియోజకవర్గాన్ని అభివృద్ధి చేస్తా

» అనకాపల్లి ఎంపీ సీఎం.రమేశ్

దేవరాపల్లి, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి): మాడుగుల నియోజకవర్గాన్ని అభివృద్ధి చేసి తీరుతానని అనకాపల్లి ఎంపీ సీఎం.రమేశ్ చెప్పారు. మండలంలోని వాలాబు, దేవరాపల్లి, కాశీపురం, నాగయ్యపేట గ్రామాల్లో ఆదివారం పల్లె పండగ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా రూ.90 లక్షలతో చేపట్టనున్న అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తితో కలిసి శంకుస్థాపన చేశారు. అనంతరం దేవరాపల్లిలో ఏర్పాటు చేసిన సభలో ఆయన మాట్లాడుతూ రైవాడ జలాశయ ప్రాంతాన్ని అన్ని అభివృద్ధి చేయడానికి కృషి చేస్తానన్నారు. గ్రామాల్లో అవసరమైన చోట మినరల్ వాటర్ ఏర్పాటు చేయడానికి నిధులు మంజూరు చేస్తానన్నారు. రైవాడను పర్యాటక కేంద్రంగా తీర్చి దిద్దాలని, మండల కేంద్రంలో డిగ్రీ కళాశాల, రైతులకు కోల్డ్ స్టోరేజీ ఏర్పాటు చేయాలని మాజీ ఎంపీపీ కిలపర్తి భాస్కరరావు ఎంపీని కోరారు. అంతకుముందు కాశీపురంలో రూ.70 లక్షలు, నాగయ్యపేట రూ.70 లక్షలు, వాలాబు రూ.8 కోట్లు అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే బండారు శంకుస్థాపన చేశారు. కాగా, గిరిజన పంచాయతీలను షెడ్యూల్డ్ ఏరియాగా మార్చాలని ఎమ్మెల్యే బండారు దృష్టికి సర్పంచ్ వెంకటలక్ష్మి తీసుకువచ్చారు. ఈ విషయాన్ని సీఎం చంద్రబాబు, గిరిజన సంక్షేమ శాఖ మంత్రి దృష్టికి తీసుకు వెళ్తామన్నారు. కార్యక్రమంలో కూటమి నాయకులు సూర్యనారాయణ, మాధవ్, సురేంద్ర, పి.పాత్రునాయుడు, రామ్మూర్తినాయుడు, సర్పంచులు సబ్బవరపు పెంటమ్మ, ఆదిరెడ్డి వరలక్ష్మి, కర్రిపుష్ప, మొల్లి కృష్ణమూర్తి పాల్గొన్నారు.

ధ్యానంతో మానసిక ప్రశాంతత



కార్యక్రమంలో మాట్లాడుతున్న కౌన్సిలర్ చింతకాయల పద్మావతి

నర్సీపట్నం, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి): మానసిక ప్రశాంతతకు ధ్యానం చేయడం చాలా అవసరమని 26వ వార్డు కౌన్సిలర్ చింతకాయల పద్మావతి అన్నారు. బలిఘట్టం బీసీ కాలనీలోని వినాయక గుడి వెనక వీధిలో ఆదివారం రామచంద్ర మిషన్ హార్ట్‌ఫుల్ నెస్ మెడిటేషన్ సెంటర్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతీ మనిషి చెడును పక్కన పెట్టి, మంచిని తీసుకోవడం అలవర్చుకోవాలని సూచించారు. ఈ మెడిటేషన్ సెంటర్‌ను అందరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు అలాగే మెడిటేషన్ సెంటర్ ఏర్పాటు చేసిన సత్యనారాయణను ఆమె అభినందించారు. అనంతరం కిమ్స్ ఆస్పత్రి ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జడ్పీటీసీ సభ్యురాలు సుకల రమణమ్మ, జోనల్ కోఆర్డినేటర్ వి.లక్ష్మయ్య, నాయకులు పోలుపర్తి వెంకునాయుడు, జిల్లాలోని హార్ట్‌ఫుల్‌నెస్ మెడిటేషన్ సెంటర్ ఇన్‌చార్జులు పాల్గొన్నారు.

తాతయ్యబాబుకు సత్కారం



తాతయ్యబాబును సత్కరిస్తున్న జిల్లా తూర్పు కాపు సంఘం నాయకులు

బుచ్చెయ్యపేట, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి): ఏపీ రాష్ట్ర గృహ నిర్మాణ కార్పొరేషన్ చైర్మన్, టీడీపీ జిల్లా అధ్యక్షుడు బత్తుల తాతయ్యబాబును ఆదివారం తూర్పు కాపు సంఘం నాయకులు మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయనకు శాలువ కప్పి సత్కరించారు. కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్షుడు పలకా రాము, నాయకులు కె.సాంబశివరావు, ఎస్.గోవిందరావు, బి.శ్రీనివాసరావు, పాంద్రంకి సత్యారావు, కోట్ని అయ్యన్నదొర, జూజుల రమేష్, సకలా గోవిందరావు, తాడి రామకృష్ణ, తిమ్మాపాత్రుని రమేష్, యలమంచిలి రమణబాబు తదితరులు పాల్గొన్నారు.

బీసీ హాస్టల్‌ను సందర్శించిన సివిల్ జడ్జి



బీసీ హాస్టల్‌ను తనిఖీ చేస్తున్న సీనియర్ సివిల్ జడ్జి రాజేంద్రబాబు

దేవరాపల్లి, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని బీసీ బాలుర వసతి గృహాన్ని చోడవరం సీనియర్ సివిల్ జడ్జి ఈ.రాజేంద్రబాబు ఆదివారం సందర్శించారు. విద్యార్థుల వసతి, మరుగుదొడ్లు, భోజనశాలను పరిశీలించారు. వర్షం వస్తే గదులు కారిపోతున్నాయని, విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని వార్డెన్ లక్ష్మీనారాయణ సివిల్ జడ్జి దృష్టికి తీసుకువెళ్లగా, వసతి గృహాల్లో సమస్యలపై ప్రభుత్వానికి నివేదిక అందించనున్నట్టు ఆయన తెలిపారు.

ఉత్సాహంగా వెయిట్ లిఫ్టింగ్ పోటీలు



వెయిట్ లిఫ్టింగ్ పోటీలు జరుగుతున్న దృశ్యం

నర్సీపట్నం, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి): ఎన్టీఆర్ మినీ స్టేడియంలో స్కూల్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఉమ్మడి విశాఖ జిల్లా స్థాయి వెయిట్ లిఫ్టింగ్, పవర్ లిఫ్టింగ్ పోటీలు జరిగాయి. ఆదివారం జడ్పీటీసీ సభ్యురాలు సుకల రమణమ్మ ఈ పోటీలను ప్రారంభించారు. అనకాపల్లి, విశాఖపట్నం, పాడేరు ప్రాంతాల క్రీడాకారులు పోటీల్లో ఉత్సాహంగా పాల్గొన్నారు. విజేతలను రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక చేస్తామని పీడీ దేవి తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంఈవోలు తలుపులు, నాగేంద్ర, నియోజకవర్గ కోఆర్డినేటర్ శ్రీనివాసులనాయుడు, పీడీలు పాల్గొన్నారు.

నిండు కుండలా కోనాం జలాశయం



కళకళలాడుతున్న జలాశయం

చీడికాడ, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి): మండలం లోని కోనాం జలాశయం నిండు కుండలా దర్శనమిస్తున్నది. ఎగువ ప్రాంతాల నుంచి వరద నీరు వస్తుండడంతో జలాశయం కళకళలాడుతోంది. జలాశయం గరిష్ఠ నీటిమట్టం 101.25 మీటర్లు కాగా, ప్రస్తుతం 99 మీటర్లకు చేరింది. ఎగువ, దిగువ కాలువలు, మెయిన్ గేట్ల ద్వారా 150 క్యూసెక్కుల నీరు విడుదల చేస్తున్నామని ఏఈ సిహెచ్.జయరాంపడాల్ తెలిపారు.

పేదల స్థలాల్లో కూల్చివేతలపై ధర్మశ్రీ ఆందోళన



తొలగించిన ఇంటి వద్ద బాధితురాలితో మాట్లాడుతున్న ధర్మశ్రీ

చోడవరం, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి): పేద మహిళలకు కేటాయించిన స్థలంలోని ఇంటి నిర్మాణాన్ని స్థానిక రెవెన్యూ అధికారులు కూల్చివేయడం సరికాదని ప్రభుత్వ మాజీ విప్ ధర్మశ్రీ ఆగ్రహం వ్యక్తం చేశారు. పట్టణ పరిధిలోని జగనన్న కాలనీ సమీపంలోని ఎలిశెట్టి పద్మ అనే మహిళ ఇంటి నిర్మాణం చేపట్టి పునాదులు నిర్మించింది. ఈ ఇంటికి అనుమతులు లేవని, అక్రమంగా నిర్మించారంటూ కొందరు ఫిర్యాదు చేయడంతో రెవెన్యూ అధికారులు రెండు రోజుల క్రితం ఈ ఇంటి పునాదులను ఎక్స్‌కవేటర్‌తో తొలగించారు. ఈ నేపథ్యంలో ఆదివారం ధర్మశ్రీ ఆధ్వర్యంలో వైసీపీ నాయకులు కూల్చివేసిన ఇంటి స్థలాన్ని సందర్శించారు. బాధితురాలితో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు.

అనంతరం విలేకరులతో ధర్మశ్రీ మాట్లాడుతూ ఎలిశెట్టి పద్మకు 2018లో తహసీల్దార్ నివాశ స్థలాన్ని కేటాయించారని, ఆమె కాలనీలో ఇంటి నిర్మాణానికి దరఖాస్తు కూడా చేసుకున్నారని, ఆ స్థలంలోనే ఇంటి నిర్మాణం చేపట్టారని చెప్పారు. బాధితురాలికి ఎలాంటి నోటీసు ఇవ్వకుండా అధికారులు కూల్చివేసి ఆమె పొట్టగొట్టారని మండిపడ్డారు. అధికారుల తీరుపై తాము సోమవారం కలెక్టర్‌ను కలిసి విన్నవించనున్నట్టు చెప్పారు. బాధితురాలికి అధికారులు న్యాయం చేయాలని లేనిపక్షంలో ఆందోళన తీవ్రతరం చేస్తామని ఆయన హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ గాడి కాసు, గాంధీగ్రామం సర్పంచ్ గాడి అప్పారావు, వైసీపీ నాయకులు ఏడువాక సత్యారావు, శ్రీకాంత్, పల్లా నరసింగరావు, డీవీఆర్ తదితరులు పాల్గొన్నారు.

అది నకిలీ ఎల్‌పీసీ: తహసీల్దార్

వైసీపీ నేతల ఆరోపణలపై తహసీల్దార్ అంబటి రామారావు స్పందించారు. బాధితురాలు ఎలిశెట్టి పద్మ చూపిస్తున్న ఎల్‌పీసీ నకిలీదిగా తాము భావించి పోలీసులకు ఫిర్యాదు చేయనున్నట్టు స్పష్టం చేశారు. జగనన్న కాలనీకి 2019లో డీ పట్టాదారుల నుంచి భూ సేకరణ చేసి, సంబంధిత రైతులకు పరిహారం ఇచ్చి లేఅవుట్ వేశామని తెలిపారు. అయితే 2019లో భూసేకరణ చేసి పరిహారం ఇచ్చిన భూమికి 2018లో ఎల్‌పీసీ ఇవ్వడం సాధ్యం కాదన్నారు. బాధితురాలితో పాటు మరో వ్యక్తి 2023లో నిర్మాణాలు చేపట్టారని, వారికి నిబంధనల ప్రకారం నోటీసులు ఇచ్చినా స్పందించకపోవడంతో తొలగించడం జరిగిందని వివరణ ఇచ్చారు.

పాత రేటు కొనసాగించకపోతే విశాఖ డెయిరీ ముట్టడి

» పాడి రైతుల ఆందోళన



దండిసురవరం పాల కేంద్రం వద్ద నినాదాలు చేస్తున్న పాడి రైతులు

చీడికాడ, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి): ఆవు పాలకు రెండు, మూడు రోజుల్లో పాత రేటు ప్రకటించకపోతే విశాఖ డెయిరీని ముట్టడిస్తామని దండిసురవరం పాడి రైతులు హెచ్చరించారు. ఈ మేరకు ఆదివారం ఉదయం దండిసురవరం పాల కేంద్రం వద్ద ఒకటి, రెండో పాల కేంద్రాల పాడి రైతులు తగ్గించిన పాల రేటును పెంచాలని డిమాండ్ ఆందోళనకు దిగారు. ఈ సందర్భంగా వారు పలు నినాదాలు చేశారు. టీడీపీ మండల ప్రధాన కార్యదర్శి బొబ్బాది తాతారావు మాట్లాడుతూ గతంలో పశు దాణా రూ.650 ఉండగా, ప్రస్తుతం వెయ్యి రూపాయల వరకు పెరిగిందన్నారు. అలాగే ఐదు లీటర్ల కాల్షియం రూ.350 ఉండగా, ప్రస్తుతం రూ.680కు పెరిగిందన్నారు. పాడి ఆవు కొనుగోలుకు రూ.లక్ష వరకు అవుతుందన్నారు. ఒక కుటుంబం పాడి ఆవును మేపితే కనీసం గిట్టుబాటు ధర కూడా రాలేదని, అలాంటిది లీటరుకు దాదాపు ఐదు రూపాయల వరకు తగ్గించడంపై సరికాదని మండిపడ్డారు. రెండు, మూడు రోజుల్లోగా పాల ధర పెంచుతూ ప్రకటన చేయాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో విశాఖ డెయిరీని ముట్టడిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సంఘం అధ్యక్షులు గర్రెడ్డి సత్యం, దర్శిశెట్టి గణేష్, మాజీ సర్పంచ్ వేపాడ నాగేశ్వరరావు, కోన అప్పారావు, పైడంనాయుడు, భూలోక పాల్గొన్నారు.



కృష్ణాదేవిపేటలో హోరున కురుస్తున్న వాన

భారీ వర్షం.. జనం ఉపశమనం

కృష్ణాదేవిపేట, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి): గొలుగొండ మండలంలోని ఏఎల్.పురం, కొంగశింగి, సీహెచ్.నాగాపురం, పల్లావూరు, పాతకృష్ణాదేవిపేట, చోద్యం, లింగంపేట గ్రామాల్లో ఆదివారం భారీ వర్షం పడింది. ఉదయం నుంచి ఎండలో ఉన్న ఈ ప్రాంతం, సాయంత్రం ఈదురుగాలులతో వర్షం పడడంతో చల్లబడింది. దీంతో ఎండతో అల్లాడుతున్న ప్రజలకు ఉపశమనం లభించింది. కాగా, ఏఎల్ పురంలో డ్రైనేజీలు సరిగ్గా లేక రోడ్డుపై మురుగునీరు ప్రవహించింది. అయితే ఈ వర్షంతో వరి, సరుగుడు, కూరగాయాల పంటలకు మేలు చేకూర్చుతుందని రైతులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

వడ్డాదిలో...

బుచ్చెయ్యపేట: వడ్డాదిలో ఆదివారం భారీ వర్షం కురిసింది. మధ్యాహ్నం వరకు ఎండ మండిపోవడంతో ప్రజలు ఇబ్బంది పడ్డారు. తర్వాత ఆకాశం మేఘావృతమైంది. ఉరుములు, మెరుపులతో సుమారు గంట పాటు కురిసిన వర్షానికి లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. వర్షంతో వాతావరణం చల్లపడటంతో జనం ఉపసమనం పొందారు.

మాడుగులలో...

మాడుగుల: మండల కేంద్రంలో ఆదివారం సాయంత్రం వర్షం కురిసింది. ఉదయం నుంచి ఎండ కాయగా, మధ్యాహ్నం కురిసిన వర్షంతో వాతావరణం చల్లబడింది. దీంతో ప్రజలుకాస్త ఉపసమనం పొందారు.

మోదకొండమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు



అమ్మవారి ఘటాలతో ఆలయానికి భయలుదేరిన భక్తులు

మాడుగుల, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి): ఉత్తరాంధ్ర జిల్లాల ఆరాధ్య దైవం మాడుగుల మోదకొండమ్మ ఆలయంలో ఆదివారం ప్రత్యేక పూజా కార్యక్రమాలను నిర్వహించారు. వేకువజాయు ఆరు గంటల నుంచి అమ్మవారిని అలంకరించిన అనంతరం ఆలయంలో పూజలు చేశారు. భక్తులు అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని మోదకొండమ్మ అమ్మవారిని దర్శించుకొని మొక్కులు, ముడుపులు చెల్లించుకున్నారు. కాగా స్థానికేతర ప్రాంతాలకు చెందిన భక్తులు అధిక సంఖ్యలో అమ్మవారి ఘటాల పండుగను నిర్వహించారు ఘటాలను నెత్తిన పెట్టుకొని ఊరేగింపుగా అమ్మవారి ఆలయానికి చేరుకొని మొక్కులు సమర్పించుకున్నారు. అనంతరం ఆలయ వెనుక భాగంలో వంటావార్పు చేసుకుని భోజనాలు చేశారు. కాగా భక్తుల సౌకర్యార్థం కమిటీ చైర్మన్ అప్పలరాజు పర్యవేక్షణలో కమిటీ సభ్యులు అన్ని ఏర్పాట్లు చేశారు.

జె.నాయుడుపాలెం కేజీబీవీ వసతి గృహం రెడీ

ప్రవేశాలకు 55 దరఖాస్తులు: ఎంఈవో

రోలుగుంట, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయం (కేజీబీవీ టైపు-4) సిద్ధమైంది. బాలికల్లో డ్రాపవుట్స్‌ను నివారించడంతో పాటు విద్యా ప్రోత్సాహకంగా ఉండాలన్న లక్ష్యంతో టీడీపీ ప్రభుత్వ హయాంలో కేజీబీవీ బాలికల వసతి గృహం మంజూరైంది. రూ.2.05 కోట్లతో ఈ హాస్టల్ భవనాలు మంజూరయ్యాయి. అయితే గత ఐదేళ్లగా వైసీపీ ప్రభుత్వం ఈ హాస్టల్‌ను కక్షపూరితంగా పూర్తిగా నిర్లక్ష్యంగా ప్రారంభించకుండా వదిలేసింది. ప్రస్తుతం కూటమి అధికారంలోకి రావడంతో దీని ప్రారంభంపై దృష్టి పెట్టింది. ఈ నెల 14న ఎమ్మెల్యే కేఎస్ఎన్ఎస్ రాజు పల్లె పండగ ప్రారంభించారు. ఈ హాస్టల్‌కు సంబంధించి అన్ని మౌలిక వసతుల కల్పనకు ఏర్పాట్లు పూర్తి చేశారు. బాలికల ప్రవేశాలకు, ఉపాధ్యాయులు, వార్డెన్, కుక్, అసిస్టెంట్ కుక్‌ల పోస్టుల భర్తీకి కూడా నోటిఫికేషన్ జారీ చేశారు. 9, 10, ఇంటర్ ఫస్ట్, ద్వితీయ సంవత్సరాలకు సంబంధించి ప్రవేశాలకు పలు గ్రామాలకు చెందిన 55 మంది విద్యార్థుల దరఖాస్తు చేసినట్టు ఎంఈవో జాన్ ప్రసాద్ తెలిపారు. అలాగే కుక్, అసిస్టెంట్ కుక్, వాచ్‌మెన్ పోస్టుల కోసం 50 దరఖాస్తులు వచ్చాయన్నారు.

220 మీటర్ల దూరంలో మద్యం దుకాణం ఉండాలి

ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ సునీల్‌కుమార్



ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ సునీల్‌కుమార్

నర్సీపట్నం, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి): ఇరవై వేలకు పైగా జనాభా ఉన్న గ్రామాలలో 220 మీటర్ల దూరంలో మద్యం దుకాణాలు ఉండాలని ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ సునీల్ కుమార్ తెలిపారు. ఆదివారం 'ఆంధ్రజ్యోతి'తో ఆయన మాట్లాడుతూ మంగళవారం వరకు మద్యం షాపులు తాత్కాలిక లైసెన్స్ మీద నడుస్తాయని చెప్పారు. ఈ నెల 23వ తేదీ తర్వాత ప్రభుత్వం లైసెన్స్ ఇస్తుందన్నారు. దుకాణదారులు కౌంటర్ పార్ట్ అగ్రిమెంట్, బ్యాంకు గ్యారెంటీ, లీజ్‌డీడ్ అగ్రిమెంట్ వంద రూపాయల స్టాంప్ పేపరు మీద రాసి ఇవ్వాలని ఆయన తెలిపారు. షాపు నడుపుతున్న భవనం ప్లాన్ రఫ్ స్కెచ్ జత చేయాలన్నారు. బడి, గుడి, మసీదు, చర్చికి వంద మీటర్ల దూరంలో మద్యం దుకాణాలు ఉండాలని స్పష్టం చేశారు. ప్రభుత్వ ఆస్పత్రులు, 35 పడకల ప్రైవేటు నర్సింగ్‌హోమ్‌కి అవే నిబంధనలు వర్తిస్తాయని వివరించారు. మద్యం పర్మిట్ రూమ్‌లకు అనుమతులు లేవన్నారు. నిబంధనలు అతిక్రమించినా, బెల్టు దుకాణాలు నిర్వహించినా కఠిన చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు.

విద్యుత్ చార్జీలు తగ్గించాలి

చీడికాడ, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ చార్జీలను వెంటనే తగ్గించాలని సీపీఎం మండల నాయకుడు రొంగలి దేముడునాయుడు డిమాండ్ చేశారు. ఈ మేరకు చినకోనాం గ్రామంలో ఆదివారం గిరిజనులతో కలసి నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వం విద్యుత్ చార్జీలు పెంచితే బాదుడే బాదుడు అన్న కూటమి పార్టీ నాయకులు, నేడు ఏ విధంగా పెను భారం మోపారని ప్రశ్నించారు. దీనిపై ప్రభుత్వం వెంటనే చర్యలు స్పందించాలని, లేనిపక్షంలో ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో గిరిజన సంఘం నాయకులు రాము, నాగరాజు, చెల్లయ్య పాల్గొన్నారు.

సైన్స్ ఎగ్జిబిషన్‌లో గురుకుల విద్యార్థుల ప్రతిభ

దేవరాపల్లి, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి): జిల్లా స్థాయి గురుకుల పాఠశాలల సైన్స్ ఎగ్జిబిషన్‌లో తెనుగుపూడి గురుకుల విద్యార్థులు ద్వితీయ స్థానం సాధించినట్టు ఉపాధ్యాయులు తెలిపారు. ఈ నెల 18న కొక్కిరాపల్లిలో జరిగిన సైన్స్, ఆర్ట్స్ పోటీల్లో కె.ప్రవీణ్, కె.సుధీర్ ద్వితీయ స్థానం సాధించారన్నారు. జిల్లా కోఆర్డినేటర్ ఎస్.రూపవతి వీరికి ప్రశంసాపత్రం అందజేశారు. ప్రిన్సిపాల్ రఘు తదితరులు పాల్గొన్నారు.

26న మండల సమావేశం

చీడికాడ, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి): మండల పరిషత్ కార్యాలయంలో ఈ నెల 26న సర్వసభ్య సమావేశం జరుగుతుందని ఎంపీడీవో హేమసుందరరావు తెలిపారు. ఎంపీపీ జయమ్మ అధ్యక్షతన జరిగే సమావేశానికి ఎంపీటీసీ సభ్యులు, సర్పంచులు, అధికారులు రావాలని ఆయన కోరారు.

మాడుగుల: మండల పరిషత్ కార్యాలయంలో ఈ నెల 26న సర్వసభ్య సమావేశాన్ని నిర్వహిస్తున్నట్టు ఎంపీడీవో కొంకి అప్పారావు ఒక ప్రకటనలో తెలిపారు. అధికారులు, ప్రజాప్రతినిధులు హాజరుకావాలని కోరారు.

వరిలో అగ్గి తెగులు



ఎండిపోతున్న పైరును చూపుతున్న రైతు లక్ష్మయ్య

గూడెంకొత్తవీధి, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అమ్మవారిధారకొండ పంచాయతీ గొల్లపల్లి గ్రామంలో వరి పొలాల్లో వ్యాపించిన అగ్గి తెగులు నివారణకు వ్యవసాయ అధికారులు సూచనలు, సలహాలు అందజేయాలని రైతులు విజ్ఞప్తి చేస్తున్నారు. గ్రామంలో ఆదివాసీ రైతులు 40 ఎకరాల్లో వరి సాగు చేస్తున్నారు. సుమారు పది ఎకరాల్లో పొలాలకు అగ్గితెగులు సోకింది. వరిచేను పాలిపోయి ఎండిపోతున్నాయి. ఈ నేపథ్యంలో వ్యవసాయ అధికారులు పొలాలను పరిశీలించి తెగులు నివారణ చర్యలు సూచించాలని రైతు లక్ష్మయ్య విజ్ఞప్తి చేశారు. రానున్న రబీ సాగుకు అవసరమైన సూచనలందించాలని కోరారు.

'భూములిచ్చిన గిరిజనులకు న్యాయం చేయండి'



గిరిజన సంక్షేమశాఖ మంత్రి సంధ్యారాణికి వినతి పత్రమిస్తున్న జడ్పీటీసీ గంగరాజు

అనంతగిరి, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి): మండలంలో నెలకొన్న ప్రధాన సమస్యలను పరిష్కరించాలని గిరిజన సంక్షేమశాఖ మంత్రి గుమ్మడి సంధ్యారాణిని స్థానిక జడ్పీటీసీ సభ్యుడు గంగరాజు కోరారు. ఆదివారం సాలూరులోని ఆమె నివాసం వద్ద మర్యాద పూర్వకంగా కలిశారు. పాతకోటలోని ఏకలవ్య పాఠశాల నిర్మాణానికి భూములు ఇచ్చిన, కుటుంబాలకు న్యాయం చేయాలని కోరారు. నాన్ టీచింగ్ పోస్టులు స్థానికులతో భర్తీచేయాలని, ఎగువశోభ నుంచి కమలపురం జామిగుడను కలుపుకుంటూ మర్రిగుడ వరకు, లంగుపర్తి పంచాయతీ ఓనుకొండ నుంచి గడ్డిబంధ వరకు రోడ్డు సౌకర్యం కల్పించాలన్నారు. మండలంలో అభివృద్ధి పనులు చేపట్టేందుకు సహకరించాలని కోరారు. వీటిపైమంత్రి సానుకూలంగా స్పందించారు. మంత్రిని కలిసిన వారిలో సీపీ ఎం నాయకులు నాగులు, వైస్ సర్పంచ్ అర్జున్, సీహెచ్. భీమన్న, అప్పలరాజు, కొండప్ప, తదితరులు ఉన్నారు.

వసతిగృహాల తనిఖీ



అనంతగిరి బాలికల-2 పాఠశాలను తనిఖీ చేస్తున్న న్యాయమూర్తి స్వర్ణలత

అనంతగిరి, అక్టోబర్ 20 (ఆంధ్రజ్యోతి): అనంతగిరి జూనియర్ కళాశాల బాలికల వసతి, బాలికల-2 పాఠశాల వసతి గృహాలను, అరకు జేఎఫ్‌సీఎం కోర్టు ప్రథమశ్రేణి న్యాయమూర్తి జి.స్వర్ణలత ఆదివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. విద్యార్థినులకు కల్పిస్తున్న సౌకర్యాలు, అందిస్తున్న మెనూ తదితర వాటిని క్షుణంగా పరిశీలించారు. కళాశాలలో బాలురకు చెందిన కిచెన్‌షెడ్డు పరిశీలించారు. వసతిగృహం నిర్వాహణపై ఆరా తీశానేజ భవనం నిర్మాణ పనులు మధ్యలో నిలిచిపోవడంతో అద్దెరూమ్‌ల్లో ఉంటున్నట్టువిద్యార్థులు న్యాయమూర్తికి వివరించారు. విద్యార్థి, విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధవహించాలని వార్డెన్లకు ఈ సందర్భంగా ఆమె సూచించారు.

నవోదయ మోడల్ ఎంట్రెన్స్ టెస్ట్



అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులతో పరీక్షల ఉపాధ్యాయులు

ముంచంగిపుట్టు, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి): స్థానిక శారదా నికేతన్ ఇంగ్లీష్ మీడియం పాఠశాలలో నర్సీపట్నం రేస్ అకాడమీ ఆధ్వర్యంలో ఆదివారం విద్యార్థులకు జవహర్ నవోదయ, సైనిక్ స్కూల్ మోడల్ ఎంట్రెన్స్ టెస్ట్‌ను నిర్వహించారు. ఈ పరీక్షకు సుమారు 90 మంది విద్యార్థులు హాజరయ్యారు. వారిలో అత్యధిక మార్కులు సాధించిన 11 మంది కి మెడల్స్‌ను అందజేశారు. ఈ సందర్భంగా రేస్ అకాడమీ ప్ర తినిధి రామచంద్రరాజు మాట్లాడుతూ విద్యార్థుల్లో ఎటువంటి తడబాటు లేకుండా పోటీ పరీక్షలు రాసేందుకు ఈ నమూనా పరీక్షలు నిర్వహిస్తున్నట్టు చెప్పారు. నవోదయ, సైనిక్ పాఠశాలతో పాటు పలు పోటీ పరీక్షల్లో అత్యధి మార్కులు సాధించేందుకు తోడ్పాడునందిస్తున్నామన్నారు. ప్రిన్సిపాల్ మత్స్యరాజు, ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.

రూ.లక్షలు వెచ్చించారు.. వృథాగా వదిలేశారు..

- గత టీడీపీ పాలనతో రూ.20 లక్షలతో హౌసింగ్ ఏఈ కార్యాలయ భవనం నిర్మాణం
- ఇళ్ల లబ్ధిదారులకు సమస్యల పరిష్కారానికి వీలుగా ఏర్పాటు
- వైసీపీ ఐదేళ్ల పాలనలో గాలికి వదిలేసిన వైనం
- వినియోగంలోకి తీసుకువస్తే మేలు



అలంకారప్రాయంగాఉన్న గృహ నిర్మాణశాఖ ఏఈ కార్యాలయం

కొయ్యూరు, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి): గృహ నిర్మాణ లబ్ధిదారుల సమస్యలు సత్వర పరిష్కారానికి వీలుగా గత టీడీపీ పాలనలో మండల కేంద్రంలో నిర్మించిన హౌసింగ్ ఏఈ కార్యాలయ భవనం నిరుపయోగంగా దర్శనమిస్తోంది. ప్రభుత్వం మంజూరు చేస్తున్న గృహాలకు సంబంధించి లబ్ధిదారుల బిల్లులు చెల్లింపు , వారి సందేహాలు, సమస్యల నివృత్తికి వీలుగా 2019కి ముందు అప్పటి తెలుగు దేశం ప్రభుత్వం హయాంలో ఈ ప్రత్యేక భవనాన్ని నిర్మించారు. అప్పట్లో సుమారు రూ. 20 లక్షలతో భవన నిర్మాణాలు చేపట్టి ప్రారంభించారు. అనంతరం ప్రభుత్వం మారింది. అప్పటినుంచి నేటి వరకు మంజూరు చేసిన గృహాలకు సంబంధించి లబ్ధిదారులకు ఉన్న బకాయిలు చెల్లించే దిశగా వైసీపీ ప్రభుత్వం చర్యలు తీసుకోలేదు. కనీసం గృహనిర్మాణ శాఖకు చేతినిండా పని ఉండేలా నూతన గృహాలు మంజూరు కాలేదు. ఫలితంగా పని లేక సంబంధిత అధికారులు కార్యాలయాన్ని తెరిచిన దాఖలాలు లేవు. దీనికితోడు గత ప్రభుత్వం మంజూరు చేసిన ఇళ్లకు సంబంధించిన వివరాలు కూడా తెలియకుండా గోప్యంగా సాగిస్తున్నారు. లబ్ధిదారుల అవసరాలు సైతం గుర్తించిన దాఖలాలు లేక పోవటంతో మండలానికి సం బంధించి గృహనిర్మాణశాఖ సిబ్బంది ఉన్నా తగిన పనిపాటా లేక ఈ కార్యాలయం మూసి ఉంచారు. దీంతో గడిచిన ఐదేళ్లుగా ఈ భవనం తలుపులు తెరచిన దాఖలాలు లేవు. దీంతో కార్యాలయ భవనం చీకటి కార్యకలాపాలకు నిలయంగా మరింది. భవనం లోపల పరిస్థితి ఎలా ఉందో తెలియని దుస్థితి నెలకొంది. తెలుగుదేశం ప్రభుత్వం లబ్ధిదారుల అవసరాలను గుర్తించి సంబంధిత శాఖ సిబ్బందినిఇ అందుబాటులో ఉంచేందుకు చర్యలు తీసుకోగా వైసీపీ ప్రభుత్వం ఆ ఆశ యాన్ని నీరుగార్చి లక్షల ప్రజా ధనాన్ని నిరుపయోగం చేసింది. కూటమి ప్రభు త్వం అధికారం చేపట్టటం గృహ నిర్మాణ పనులు చురుగ్గా సాగుతున్న నేపథ్యంలో ఇప్పటికైనా ఈ భవనాన్ని వినియోగంలోకి తెచ్చేలా చర్యలు చేపట్టాలని పలువురు కోరుతున్నారు.

గంజాయి రవాణాతో జీవితాలను నాశనం చేసుకోవద్దు



అవగాహన ర్యాలీలో సీఐ వెంకటరమణ, ఎస్ఐ శంకరరావు తదితరులు

కొయ్యూరు, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి): యువత బంగారు భవిష్యత్తు నాశనం చేసే గంజాయి జోలికి పోవద్దని కొయ్యూరు సీఐ వెంకటరమణ, మంప ఎస్ఐ శంకరరావు సూచించారు. ఆదివారం రాజేంద్రపాలెం వారపు సంతలో గంజాయి అక్రమ రవాణాతో కలిగే నష్టాలను వివరించారు. వ్యాపారులు ఇచ్చే డబ్బుకు ఆశపడి గంజాయి అక్రమ రవాణాకు పాల్పడవద్దన్నారు. అలాగే, అటవీ జంతువులను వేటాడేందుకు విద్యుతు తీగలను ఏర్పాటు చేయవద్దన్నారు. దీని వల్ల కలిగే ప్రాణ నష్టాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. అటవీ జంతువులను వేటాడడం చట్టరీత్యా నేరమని, ఇందుకు పాల్పడిన వారిపై కఠిన చర్యలు ఉంటాయన్నారు. ఈ కార్యక్రమంలో కొ య్యూరు, మంప స్టేషన్ల సిబ్బంది, అధిక సంఖ్యలో వారపు సంతకు వచ్చిన గిరిజనులు పాల్గొన్నారు.

పంటలకు గిట్టుబాటు ధర కల్పించాలి

- భారతీయ కిసాన్ సంఘ్ జిల్లా అధ్యక్షుడు వెంకట రమణ



సంఘీభావం తెలుపుతున్న గిరిజన రైతులు

చింతపల్లి, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి): గిరిజన రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు ధర కల్పించాలని భారతీయ కిసాన్ సంఘ్ జిల్లా అధ్యక్షుడు పాంగి వెంకట రమణ డిమాండ్ చేశారు. ఆదివారం స్థానిక గిరిజన భవన్‌లో గిరిజన రైతులు సమావేశమయ్యారు. ఈసందర్భంగా జిల్లా అధ్యక్షులు మాట్లాడుతూ రైతుల సంక్షేమమే లక్ష్యంగా భారతీయ కిసాన్ సంఘ్ ఆవిర్భవించిందన్నారు. ఉద్యమాల ద్వారా రైతుల హక్కులను సాధించుకుంటున్నామన్నారు. గిరిజన ప్రాంతంలో ఆదివాసీలు పండించిన వరి, రాగి, సామ, కొర్రలకు గిట్టుబాటు ధరలు అందించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉన్నదన్నారు. అలాగే, మిరియాలు, పసుపు, అల్లం, కూరగాయలు, ఉద్యాన పంటలకు మార్కెటింగ్ సదుపాయం కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి గేదెల శ్రీను, కార్యవర్గ సభ్యులు సత్యనారాయణ, కగుపతి, మండలాధ్యక్షులు కొర్ర సుహేన్‌బాబు, కార్యదర్శి అడపా బాబులునాయుడు, కార్యవర్గ సభ్యులు నూకరాజు, మిత్ర, కంఠంనాయుడు పాల్గొన్నారు.

ఘనంగా సత్య సాయిబాబా అవతార దినోత్సవం



సత్య సాయిబాబా చిత్రపటాన్ని ఊరేగిస్తున్న ట్రస్టు ప్రతినిధులు

పాడేరు రూరల్, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి): భగవాన్ సత్య సాయిబాబా అవతార దినోత్సవం ఆదివారం పాడేరులో ఘనంగా నిర్వహించారు. సత్య సాయి బాబా సేవా సమితి ప్రతినిధులు గణేష్, సుబ్బారావు, జిల్లా ఆధ్యాత్మిక సేవా సంఘం చైర్మన్ కొట్టగుళ్లి సింహాచలం నాయుడు ఆధ్వర్యంలో సుండ్రుపుట్టు షిర్డీ సాయిబాబా ఆలయం నుంచి పట్టణంలోని ప్రధాన రహదారిలో సత్య సాయి బాబా చిత్రపటంతో భారీ ఊరేగింపు చేపట్టారు. అంబేడ్కర్ కూడలిలో సాయి భజన మండలి ఆధ్వర్యంలో బాబా కీర్తనలు ఆలపించారు. భక్తులకు ప్రసాదం పంపిణీ చేశారు. అక్కడ నుంచి హుకుంపేట మండలం గడుగుపల్లి గ్రామంలో ఉన్న సత్యసాయిబాబా ఆలయం వరకు సంకీర్తనలతో ఊరేగింపు చేపట్టారు. ఈ కార్యక్రమంలో ఆధ్యాత్మిక సేవా సంఘం ప్రతినిధులు ఉప్పల వెంకటరత్నం, కొట్టగుళ్లి రామారావు, సిద్ధినాటి కొండలరావు, బీవీఎస్.ముకుందరావు పాల్గొన్నారు.

'తాజంగి'లో అదనపు బోట్లు ఏర్పాటు చేయాలి

- పాడేరు ఎమ్మెల్యే విశ్వేశ్వరరాజు



తాజంగి జలాశయంలో బోటు షికారు చేస్తున్న ఎమ్మెల్యే

చింతపల్లి, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి): లంబసింగికి సమీపంలోనున్న తాజంగి జలాశయం వద్ద అదనపు బోట్లు ఏర్పాటు చేయాలని పాడేరు ఎమ్మెల్యే మత్స్యరాస విశ్వేశ్వరరావు కోరారు. ఆదివారం ఆయన తాజంగి జలాశయం, వేనం చెరువుల వ్యూ పాయింట్, బోడకొండమ్మ దేవాలయాన్ని సందర్శించారు. జలాశయం వద్ద బోటు షికారు చేశారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ లంబసింగికి ఏటా పర్యాటకుల తాకిడి పెరుగుతుందన్నారు. ఈ నేపథ్యంలో లంబసింగి, తాజంగి ప్రాంతాల్లో పర్యాటకులకు ఐటీడీఏ, పర్యాటకశాఖ అధికారులు మౌలిక సదుపాయాలు కల్పించాలన్నారు. ప్రధానంగా మరుగుదొడ్లు నిర్మించాలన్నారు. రక్షిత తాగునీటి సౌకర్యం కల్పించాలన్నారు. పారిశుధ్య సమస్య తలెత్తకుండగా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. తాజంగి జలాశయం వద్ద ప్రస్తుతం ఒక బోటు మాత్రమే అందుబాటులో ఉన్నదని, అదనపు బోట్లు ఏర్పాటు చేయాలన్నారు. పర్యాటక వికాస్ నిర్వహిస్తున్న సాహస క్రీడలను అభివృద్ధి చేయాలన్నారు. బంజీట్రాపోలిన్, స్కై సైక్లింగ్, బర్మాబ్రిడ్జ్, టైర్‌వాల్ క్రీడలను ఏర్పాటు చేయాలన్నారు. లంబసింగి-తాజంగి ప్రధాన మార్గంలో నిర్మిస్తున్న స్వాతంత్ర్య సమరయోధుల మ్యూజియం పనులు వేగవంతం చేయాలని అధికారులను కోరారు.

రూ. 7.35 కోట్లతో అభివృద్ధి పనులు



అరకు ఎంపీడీవో లవరాజు

అరకులోయ, అక్టోబరు 20, (ఆంధ్రజ్యోతి): పల్లె పండగ కార్యక్రమంలో భాగంగా మండలంలో 14 పంచాయతీల్లో రూ.7.35 కోట్లతో అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టినట్లు ఎంపీడీవో ఎ.లవరాజు తెలిపారు. ఎంపీడీవో 'ఆంధ్రజ్యోతి' తో మాట్లాడారు. ఉపముఖ్యమంత్రి, పంచాయతీ రాజ్ శాఖ మంత్రి పవన్‌కల్యాణ్ ఆదేశాల మేరకు సంక్రాంతి నాటికి ఈ పనులు పూర్తి చేయాలని లక్ష్యంగా నిర్ణయించినట్టు చెప్పారు. గ్రామాల్లో ఫ్రైడే-డ్రైడే కార్యక్రమం విధిగా చేపడుతున్నట్టు తెలిపారు. పీవో ఐటీడీఏ ఆదేశాల మేరకు పంచాయతీల్లో పారిశుధ్య పనులు చేపట్టేలా చర్యలు తీసుకుంటున్నట్టు చెప్పారు. డెంగ్యూ మలేరియా నిరోధానికి పంచాయతీ, గ్రామ సచివాలయాల్లో అధికారులను అప్రమత్తం చేసినట్టు వివరించారు.

22 నుంచి ఆధార్ అప్‌డేటేషన్ శిబిరాలు

ఈ నెల 22 నుంచి 25వ తేదీవరకు బస్కీ, పద్మాపురం-2, పెదలబుడు-3, గన్నెల గ్రామ సచివాల యాల్లో ఆధార్ అప్‌డేటేషన్ కేంద్రాలను అందుబాటులోకి తీసు కు వ స్తు న్నట్టు ఎంపీడీవో వివరించారు. మండలంలో ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. 18 ఏళ్ల నిండివారు కొత్త కార్డులు, మార్పులు చేసుకోవచ్చన్నారు. పాత ఆధార్‌కార్డులను అప్‌డేట్ చేయించుకోవాలని సూచించారు.



తల్లి, కుటుంబ సభ్యులతో మాట్లాడుతున్న ఆస్పత్రి సూపరింటెండెంట్ ప్రభావతి



అంబులెన్సులో కేజీహెచ్‌కి విద్యార్థిని తరలిస్తున్న దృశ్యం

విరేచనాలతో విద్యార్థిని పరిస్థితి విషమం

- చింతపల్లి ఏరియా ఆస్పత్రిలో చికిత్స... కేజీహెచ్‌కు తరలించాలనే ప్రయత్నాలకు తల్లి అడ్డగింత
- ఐటీడీఏ పీవో అభిషేక్ జోక్యంతో ఎట్టకేలకు తరలింపు

చింతపల్లి, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి): విరేచనాలు, జ్వరంలో తీవ్ర అస్వస్థత పాలైన విద్యార్థినికి ఆస్పత్రి వైద్యం వద్దని..నాటుమందు అందిస్తామంటూ స్వయాన ఆమె తల్లి అడ్డుతగిలి మొరాయించింది. ఈక్రమంలో చింతపల్లి ఏరియా ఆస్పత్రి వద్ద దాదాపు ఐదు గంటలపాటు హై డ్రామా నడిచింది. తర్వాత ఎట్టకేలకు ఐటీడీఏ పీవో అభిషేశ్ జోక్యంతో ఆవిద్యార్థినిని అధికారులు విశాఖ కేజీహెచ్‌కు తరలించారు. వివరాలివి.. గూడెంకొత్తవీధి మండలం వంచుల పంచాయతీ ఏబులం కొడిసింగి గ్రామానికి చెందిన కొర్ర రిబక రింతాడ గిరిజన సంక్షేమశాఖ బాలికల ఆశ్రమ పాఠశాలలో ఏడో తరగతి చదువుతున్నది. దసరా సెలవులకు ఇంటికి వెళ్లిన రిబక, అదే పాఠశాలలో పదో తరగతి చదువుతున్న అక్క అఖిలతో కలిసి శుక్రవారం సాయంత్రం వసతి గృహానికి వచ్చింది. అదే రోజు రాత్రి రిబకకు వాంతులయ్యాయి. దీంతో పాఠశాల హెల్త్ అసిస్టెంట్ కృష్ణవేణి మందులిచ్చినా తగ్గలేదు. ఆదివారం ఉదయానికి విద్యార్థినికి తీవ్ర జ్వరం వచ్చింది. దీంతో ఏఎన్ఎం, డిప్యూటీ వార్డెన్ విజయ కుమారి రిబకను చింతపల్లి ఏరియా ఆస్పత్రికి మధ్యాహ్నం ఒంటి గంటకు తీసుకొచ్చారు. విద్యార్థినిని పరీక్షించిన మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ జి. ప్రభావతి మలేరియా, టైఫాయిడ్, డెంగ్యూ పరీక్షలు చేయించి చికిత్స ప్రారంభించారు. అయితే, విద్యార్థిని అప్పటికే అపస్మారక స్థితికి చేరింది. దీంతో మెరుగైన పరీక్షల కోసం వెంటనే బాలికను కేజీహెచ్‌కి తీసుకు వెళ్లాలని మెడికల్ సూపరింటెండెంట్ ఉపాధ్యాయులు, విద్యార్థిని తల్లి సునీతకు చెప్పారు. అయితే విద్యార్థిని తల్లి వారం రోజుల క్రితం తన భర్త శ్రీను కడుపునొప్పితో బాధపడుతుండడంతో కేజీహెచ్‌కి తీసుకువెళ్లామని, అక్కడ ఆపరేషన్ చేసినప్పటికి తన భర్త బతకలేదని, ఈ స్థితిలో కుమార్తెకు అదే పరిస్థితి వస్తుందని ఆందోళన వ్యక్తంచేశారు. ఇంటికి తీసుకు వెళ్లి నాటు వైద్యం చేయించుకుని బతికించుకుంటానని స్పష్టంచేసింది. ఆస్పత్రి సూపరింటెండెంట్, ఏటీడబ్ల్యూవో జయనాగలక్ష్మి, ఉపాధ్యాయులు, పోలీసు, వీఆర్వోలు సాయంత్రం ఐదు గంటల వరకు తల్లి సునీతను ఒప్పించేందుకు పలు ప్రయత్నాలు చేసినప్పటికి ఆమె ఒప్పుకోలేదు. చివరికి ఐటీడీఏ పీవో అభిషేక్ స్వయంగా బాలిక తల్లి, గ్రామ పెద్దలతో ఫోన్‌లో మాట్లాడారు. కేజీహెచ్‌లో బాలికకు అవసరమైన వైద్యం, ఇతర సదుపాయాలు తానే స్వయంగా చూసుకుంటానని నచ్చజెప్పడంతో అంగీకరించారు. దీంతో సాయంత్రం ఐదు గంటలకు విద్యార్థిని రిబకాను అంబులెన్సులో ఉపాధ్యాయులు, తల్లి కేజీహెచ్‌కి తరలించారు.

అనారోగ్యంతో శిశువు మృతి



మృతి చెందిన మగ శిశువు

పెదబయలు, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి : మండలంలోని గిన్నెలకోట పంచాయతీ చేమగెడ్డ గ్రామానికి చెందిన లకే రామయ్య మరియకుమారి దంపతులకు పుట్టిన మూడు మాసాల మగ శిశువు అనారోగ్యంతో ఆదివారం మృతి చెందాడు. రెండు రోజుల నుంచి అనారోగ్యంతో బాధపడుతూ ఉదయం మృతి చెందడంతో రామయ్య దంపతులు బోరున విలపించారు. ఇటీవల ఈ ప్రాం తంలో వరుస శిశు మరణాలు సంభవిస్తుండడంతో పలువురు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

భక్తులతో కిటకిటలాడిన మోదకొండమ్మ ఆలయం

పాడేరురూరల్, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి): ఉత్తరాంధ్ర ప్రజల ఆరాధ్య దైవం పాడేరులోని మోదకొండమ్మ ఆలయం ఆదివారం భక్తులతో కిటకిటలాడింది. మన్యంలోని వివిధ గ్రామాలతో పాటు మైదాన ప్రాంతానికి చెందిన వందలాది మంది భక్తులు అమ్మవారి దర్శనానికి వచ్చారు. మైదాన ప్రాంత భక్తులు అమ్మవారికి ఘటాలను సమర్పించి ప్రత్యేక పూజలతో మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయ ప్రాంగణంలో బంధుమిత్రులు, కుటుంబ సభ్యులతో ఆనందంగా గడిపారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన అన్న సమారాధనలో వందలాది మంది భక్తులు పాల్గొన్నారు. పాడేరు ఘాట్‌లోని మోదాపల్లి జంక్షన్ వద్ద గల అమ్మవారి పాదాలకు భక్తులు పూజలు చేపట్టారు.

'పల్లె పండుగ'తో సౌకర్యాల కల్పన



సీలేరులో ఇంకుడు గుంత నిర్మాణానికి భూమి పూజ చేస్తున్న నాయకులు

సీలేరు, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి): గూడెంకొత్తవీధి మండలంలోని సీలేరు మేజర్ పంచాయతీ చింతపల్లి క్యాంప్‌లో ఆదివారం పల్లె పండుగ కార్యక్రమం జరిగింది. ఈసందర్భంగా గ్రామంలో ఇంకుడు గుంతల నిర్మాణానికి సర్పంచ్ దుర్గో, ఎన్డీయే కూటమి నాయకులు భూమి పూజ చేశారు. సర్పంచ్ మాట్లాడుతూ పల్లె పండుగ ముందుకు సాగకుండగా కొంత మంది కూటమి నాయకులు అడ్డుకుంటున్నారని, ఇది సరైన పద్ధతికాదన్నారు. ఈకార్యక్రమంలో జూనియర్ అసిస్టెంట్ అప్పలరాజు, కాంగ్రెస్ నాయకుడు కారే శ్రీనివాస్, వార్డు సభ్యుడు పాపారావు, బీజేపీ నాయకుడు అప్పలరాజు, ఇంజనీరింగ్ అసిస్టెంట్ కుసుమ, మహిళా పోలీసు రేవతి, పశుసంవర్ధక సహాయకులు అనుష్క, డిజిటల్ అసిస్టెంట్ విజయ పాల్గొన్నారు.

ఉపాధి కూలీలకు వంద రోజుల పనిదినాలు:ఈసీ



ఉపాధి పనులకు శంకుస్థాపన చేస్తున్న ప్రజాప్రతినిధులు

గూడెంకొత్తవీధి: ఉపాధి కూలీలకు వంద రోజుల పనిదినాలు కల్పిస్తామని ఈసీ అప్పలనాయుడు అన్నారు. ఆదివారం మండలంలోని అమ్మవారి ధారకొండ పంచాయతీ పెబ్బెంపల్లిలో పల్లె పండుగ కార్యక్రమం జరిగింది. ఈసందర్భంగా గ్రామంలో ఇంకుడు గుంతల నిర్మాణాలకు శంకుస్థాపన చేశారు. ఈసందర్భం గా ఈసీ మాట్లాడుతూ కొత్తగా పెళ్లయిన కుటుంబాలకు సైతం జాబ్ కార్డులు జారీ చేస్తామన్నారు. ఉపాధి పనులను గిరిజనులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యమంలో సర్పంచ్ ముర్ల సత్యవతి, ఉపాధి పథకం టీఏ సింహాచలం, ఫీల్డ్ అసిస్టెంట్ శాంతి, వెలుగు, సచివాయల ఉద్యోగులు పాల్గొన్నారు.

అప్రోచ్ రోడ్డును పూర్తిచేయండి



ఎమ్మెల్యే బండారుకు విన్నవిస్తున్న గిరిజనులు, టీడీపీ నేతలు

అనంతగిరి, అక్టోబరు 20 (ఆంధ్ర జ్యోతి): దేవరాపల్లి- అ నంతగిరి మండలం శివారు గ్రామాలను ఆనుకుని, శారదనదిపై నిర్మించిన వంతెనకు గల అప్రోచ్ రోడ్డుపూర్తి చేయాలని మాడుగుల ఎమ్మెల్యే బండా రు సత్యనారాయణను కలిసి జీనబాడు పంచాయతీ గిరిజనులు కోరారు. అప్రోచ్ రోడ్డుతో పాటుగా వంతెనను మరమ్మతులకు పూర్తి చేయాలని కోరారు. ఈ వంతెనపై నుంచి సుమారు వంద గ్రామాల గిరిజనులు రాకపోకలు సాగిస్తున్నట్టు పేర్కొన్నారు. ఎమ్మెల్యేను కలిసి వారిలో నాయకులు సురేశ్, శ్రీరాములు, శ్రీను, దేముడు, నాయుడు, తదితరులు ఉన్నారు.

గ్రామ పంచాయతీకి ఒకే సచివాలయాన్ని ఏర్పాటు చేయాలి

పంచాయతీ రాజ్ ఛాంబర్ ఉపాధ్యక్షులు బొర్రా నాగరాజు




మాట్లాడుతున్న నాగరాజు

పాడేరురూరల్, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి): గ్రామ పంచాయతీకి ఒకే సచివాలయాన్ని ఏర్పాటు చేసి ఆ సిబ్బందిని గ్రామ పంచాయతీకి అనుసంధానం చేసేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యదర్శి, పంచాయతీ రాజ్ ఛాంబర్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు బొర్రా నాగరాజు కోరారు. గత వైసీపీ ప్రభుత్వం గ్రామ వార్డు సచివాలయ వ్యవస్థను ఏర్పాటు చేసి ఒక్కోదానిలో 11 మంది సిబ్బందిని నియమించిందన్నారు. వీరిపై పర్యవేక్షణలేక తీవ్ర గందరగోళంగా మారినట్టు ఆయన ఆరోపించారు. చాలా గ్రామాల్లో రెండు నుంచి ఐదు వరకు సచివాలయాలను ఏర్పాటు చేయడంతో సిబ్బందికి పనిలేకుండా పోయిందన్నారు. ఈ వ్యవస్థ పూర్తిగా రాజ్యాంగ, చట్ట వ్యతిరేకంగా రూపకల్పన జరిగిందన్నారు. దీనికి పరిష్కారంగా చర్యలు చేపట్టాలని గత వైసీపీ ప్రభుత్వంలో మూ డేళ్ల ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పంచాయతీ ఛాంబర్, సర్పంచ్‌ల సంఘం జిల్లా రాష్ట్ర కమిటీలు పోరాటాలు, ఉద్యమాలు చేసిన ఫలితం లేక పోయిందన్నారు. ఈస్థితిలో ప్రస్తుత ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి, పంచాయతీ రాజ్ శాఖ మంత్రి పవన్ కల్యాణ్ స్పందించి గ్రామ పంచాయతీకి ఒక సచివాలయాన్ని ఏర్పాటు చేసి గ్రామ పంచాయతీకి అనుసంధానం చేయాలన్నారు. ఈ నేపథ్యంలో 21వ తేదీన అల్లూరి జిల్లా కలెక్టర్ ఏఎస్ దినేశ్ కుమార్‌కు వినతిపత్రం అందిస్తున్నట్టు చెప్పారు. జిల్లాలోని అన్ని పంచాయతీల సర్పంచ్‌లు విధిగా హాజరు కావాలని ఆయన కోరారు.

ఉపాధి పనులపై సోషల్ ఆడిట్

కొయ్యూరు, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి): మండలంలో ఉపాధి హామీ పథకానికి సంబంధించి 16వ విడత సోషల్ ఆడిట్ పకడ్బందీగా నిర్వహిస్తున్నట్టు పథకం ఆడిట్ బృంద స్టేట్ రీసోర్స్ పర్సన్ సీహెచ్ రాజు తెలిపారు. ఈ మే రకు 2023 ఏప్రిల్ 1 నుంచి 2024 మార్చి 31 వరకు పథకం ద్వారా ఖర్చు చేసిన రూ 46.18 కోట్లకు సంబంధించి మండలంలో 33 పంచాయతీల్లో ఆడిట్ జరగనుందన్నారు. ఇందులో వేతనాల చెల్లింపులకు గానూ రూ 24.08 కోట్లు, మెటీరియల్ కాంపోనెంట్ కింద పంచాయతీరా జ్, ఇంజనీరింగ్, పశు సంవర్ధక శాఖల అధ్వ ర్యంలో రూ 22.09 కోట్లు చేసినట్టు వివరించారు. ఈఆడిట్ 33 పంచాయతీలలో ఈ నెల 31 వరకు గ్రామస్థాయి ఆడిట్ జరుపుతామన్నారు.

ప్రకృతి మురిసె.. హరివిల్లు విరిసే..



కించుమండలో కనువిందుచేసిన ఇంద్రధనస్సు

దుంబ్రిగుడ, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి): కించుమండలో ఆదివారం ఇంద్రధనుస్సు కనువిందు చేసింది. సాయంత్రం ఆకాశం మేఘావృతమై చినుకులు ప్రారంభమైన కొద్దిసేపటికి ఆ గ్రామ శివాలయంవద్ద పచ్చదనంతోపరిసరాలు, కొండలఅంచున విరిసిన ఇంద్రధనుస్సు ముచ్చటగొలిపాయి. ప్రకృతి ప్రేమికులు సెల్‌ఫోన్లలో ఈ దృశ్యాన్ని బంధించారు.



ట్యాంకు మెట్లకు పెచ్చులూడి ఉన్న దృశ్యం

శిథిలావస్థలో నీటి పథకం ట్యాంకు

- భయాందోళన చెందుతున్న ఇరువాడ ఎస్సీ కాలనీ వాసులు
- పలుచోట్ల పైపుల లీకేజీతో తాగునీరు వృథా
- ఫిర్యాదు చేసినా పట్టించుకోని అధికారులు



సబ్బవరం, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి) :మండలంలోని ఇరువాడ ఎస్సీ కాలనీలో గల రక్షిత మంచినీటి పథకం ట్యాంకు శిథిలావస్థకు చేరుకుంది. పిల్లర్లు బీటలు వారడంతో ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని స్థానికులు భయాందోళన చెందుతున్నారు. 24 ఏళ్ల క్రితం ప్రభుత్వం అప్పటి అవసరాల మేరకు ఇరువాడ గ్రామ సమీపంలో పంప్ ఏర్పాటు చేసి, కాలనీలో ట్యాంక్ నిర్మించింది. నాటి నుంచి ఈ పథకం ద్వారా వచ్చే నీటినే వినియోగిస్తున్నారు. అయితే ట్యాంకు నిర్మించి దాదాపు రెండున్నర దశాబ్దాలు కావస్తుండడంతో శిథిలావస్థకు చేరుకుంది. పంప్ హౌస్ నుంచి ట్యాంక్‌కు వచ్చే పైపులు కూడా పలు చోట్ల లీకవుతున్నారు. దీంతో చాలావరకు నీరు వృథాగా పోతోంది. ఫలితంగా కాలనీవాసులు తాగునీటికి తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. సుమారు రెండున్నర దశాబ్దాల క్రితం నిర్మించిన ఈ నీటి ట్యాంకు ప్రస్తుత జనాభాకు చాలడం లేదు. దీనికితోడు శిథిలావస్థకు చేరడం, లీకేజీల కారణంగా నీరు వృథాగా పోతుండడం వల్ల మరిన్ని ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని అక్కడివారు వాపోతున్నారు. ఈ సమస్యను పలుమార్లు అధికారులు, ప్రజాప్రతినిధుల దృష్టికి తీసుకు వెళ్లినా ఫలితం లేకపోతోందని ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా ఈ సమస్యపై అంతా స్పందించాల్సిందిగా కోరుతున్నారు.

'29 నుంచి ఆరోగ్యమిత్రల నిరవధిక సమ్మె'



ఆరోగ్యమిత్రల సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా అధ్యక్షుడు కనకం

తుమ్మపాల, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి) : ఆరోగ్యశ్రీ పథకం ద్వారా సేవలందిస్తున్న సిబ్బంది సమస్యల పరిష్కారానికి ఈనెల 29 నుంచి నిరవధిక సమ్మె చేపట్టనున్నారని ఏపీ ఆరోగ్యమిత్ర కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు జి.కనకం తెలిపారు. ఆదివారం ఇక్కడి సీపీఐ కార్యాలయంలో జరిగిన ఆరోగ్యమిత్రల సమావేశంలో మాట్లాడారు. గత 17 ఏళ్లుగా ఆరోగ్యమిత్రలు విశేష సేవలందిస్తున్నా ప్రభుత్వాలు పట్టించుకోవడం లేదని వాపోయారు. సిబ్బందికి సమాన పనికి సమాన వేతనం అమలు చేయడంతో పాటు ప్రభుత్వ కాంట్రాక్టు ఉద్యోగులుగా గుర్తించాలని, అంతర్గత పదోన్నతులు కల్పించాలని, మృతి చెందిన సిబ్బంది కుటుంబానికి రూ.15 లక్షలు ఎక్స్‌గ్రేషియా అందించాలని, ఉద్యోగ విరమణ సమయంలో రూ.10లక్షలు గ్రాట్యూటీ ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో ఏఐటీయూసీ జిల్లా గౌరవాధ్యక్షుడు వైఎన్ భద్రం, ఆరోగ్యమిత్రల సంఘం జిల్లా నాయకులు నాయుడు, సోమేష్, దుర్గాప్రసాద్, మూర్తి, రమణి, శంకర్, కరుణ, రత్నకుమారి తదితరులు పాల్గొన్నారు.

23న రవాణా శాఖ సీజ్ చేసిన వాహనాల వేలం

తుమ్మపాల, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి) : రవాణా శాఖ అధికారులు నిర్వహించిన తనిఖీల్లో సీజ్ చేసిన వాహనాలను ఈ నెల 23న వేలం వేయనున్నామని అనకాపల్లి ప్రాంతీయ రవాణాశాఖ అధికారి జి.మనోహర్ ఆదివారం తెలిపారు. అపరాధ రుసుం, పన్ను బకాయిలు చెల్లించాలని సదరు వాహనాల యజమానులకు పలుమార్లు నోటీసులు జారీ చేసినా వారితో పాటు ఫైనాన్షియర్లు కూడా స్పందించలేదన్నారు. ఈ మేరకు బుధవారం మధ్యాహ్నం మూడు గంటలకు ఇక్కడి ప్రాంతీయ రవాణా శాఖ కార్యాలయం వద్ద ఐదు గూడ్స్ వాహనాలు, ఒక మ్యాక్సీ క్యాబ్ వాహనాన్ని బహిరంగ వేలం వేస్తున్నామని వెల్లడించారు. ఆసక్తి గల వారు పూర్తి వివరాలకు నేరుగా కార్యాలయాన్ని సంప్రదించాల్సిందిగా ఆయన కోరారు.

చినరామస్వామి ఆలయంలో స్వచ్ఛతే సేవ



ఆలయాన్ని శుభ్రం చేస్తున్న భక్తుల

అనకాపల్లి టౌన్, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని గవరపాలెం చినరామస్వామి ఆలయంలో ఆదివారం స్వచ్ఛతే సేవ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆలయ వంశపారంపర్య ధర్మకర్త విల్లూరి మహాలక్ష్మినాయుడు ఆధ్వర్యంలో మహిళలు, యువకులు చీపుర్లు చేతపట్టి పరిసరాలను తీర్చిదిద్దారు. బొడ్డేడ మురళీ, చినరామ యువజన సేవా సంఘం నిర్వాహకులు ఆలయ ప్రాంగణంలోని పిచ్చి మొక్కలను తొలగించారు. సంఘం సభ్యులు, కాకతాంబ ఫ్యామిలీ గ్రూప్, స్థానిక మహిళలు పాల్గొన్నారు.

వెదుళ్లనరవలో అక్రమ నిర్మాణం తొలగింపు

సబ్బవరం, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని వెదుళ్లనరవ సర్వే నెంబరు 121లో చేపట్టిన అక్రమ నిర్మాణాన్ని తహసీల్దార్ బి.చిన్నికృష్ణ ఆదేశాల మేరకు రెవెన్యూ అధికారులు ఆది వారం తొలగించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వ భూములు, గెడ్డ వాగులు ఆక్రమిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ వీరయ్య, వీఆర్ఏ రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

రామాపురం కాలనీలో సమస్యల కొలువు

చినుకు పడితే చిత్తడిగా మారుతున్న రహదారులు

- విలేజ్ హెల్త్ క్లీనిక్ తదితరాల్లో చెరువులా మారుతున్న వర్షపునీరు
- ఇళ్ల ముందు మురుగు తిష్టతో దోమలు, దుర్వాసన
- ఉన్నతాధికారులు తక్షణమే స్పందించాలని అంతా వేడుకోలు



రామాపురంలో విలేజ్ క్లీనిక్ వద్ద చెరువులా మారిన వర్షపు నీరు



మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాల ముందు...

కొత్తూరు, అక్టోబర్ 20 (ఆంధ్రజ్యోతి): కొత్తూరు.. అనకాపల్లి మండలం పరిధిలో ఇదో మేజర్ పంచాయతీ. ఇక్కడ అడుగడుగునా సమస్యలే.. ఈ పరిధిలో ఉన్న రామాపురం కాలనీ మరీ దారుణం. ఎక్కడికక్కడ మురుగు తిష్ట వేస్తోంది. దీంతో కాలనీ వాసులు నిత్యం దోమలు, తీవ్ర దుర్వాసన నడుమ ఇబ్బందులు ఎదుర్కొనాల్సి వస్తోంది. చిన్నపాటి వర్షానికే రోడ్లన్నీ చిత్తడిగా మారుతున్నాయి. వాటిపై పడిన గుంతల్లో నీరు చేరుతుండడంతో రాకపోకలకు అవస్థలు పడుతున్నారు. కాలనీలో ఇరువైపులా కాలువలు లేకపోవడం, జల్ జీవన్‌మిషన్ పథకంలో భాగంగా ఏర్పాటు చేసిన ఇంటింటి కొళాయిల కోసం తీసిన గోతులను పూడ్చకుండా వదిలేయడంతో రోడ్లన్నీ అస్తవ్యస్తంగా మారాయి. ప్రజారోగ్యం పట్ల అధికారులు చర్యలు తీసుకోకపోవడం అన్యాయమని అక్కడివారంతా వాపోతున్నారు. రోగం వస్తే కనీసం ఆసుపత్రికి వెళ్లేందుకు కూడా వీలు పడని పరిస్థితిలో తమ కాలనీ ఉందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇదిలావుంటే, ఇక్కడ కాలువలు లేకపోవడంతో ఇళ్లలో వాడుకనీరు రోడ్డు పైకి గొట్టాల ద్వారా విడిచిపెడుతున్నారు. దీని వల్ల నీరు నిల్వ ఉండి మురుగుగా తయారవుతోందని అంటున్నారు. కాగా ఇదే ప్రాంతంలో వరుసగా అంగన్‌వాడీ కేంద్రం, విలేజ్ క్లీనిక్, మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాల ఉన్నాయి. వర్షం వస్తే ఈ మూడు భవనాల ఎదుట వర్షపు నీరు నిలిచిపోయి చెరువును తలపిస్తున్నాయి. కాలనీలో పరిస్థితులు ఇంత దారుణంగా ఉన్నా ఎవరూ స్పందించకపోవడం అన్యాయమని స్థానికులు వాపోతున్నారు. తక్షణమే వీటన్నింటినీ క్షేత్రస్థాయిలో పరిశీలించి కాలనీని అభివృద్ధి చేయాలని అధికారులు, ప్రజాప్రతినిధులను అంతా ముక్తకంఠంతో కోరుతున్నారు.



గోతులతో దర్శనమిస్తున్న కాలనీకి వెళ్లే ప్రధాన రోడ్డు



ఇళ్లలో వాడుక నీరు గొట్టం ద్వారా బయటకు విడిచిపెడుతున్న దృశ్యం

పేదల భూములను వైసీపీ నేతలు కాజేశారు

- రీ సర్వే పేరుతో ఇందులకు పాల్పడ్డారు
- పల్లె పండుగలో ఎమ్మెల్యే కొణతాల, మాజీ ఎమ్మెల్యే పీలా ఆరోపణ



కస్నూరుపాలెంలో అభివృద్ధి పనుల శంకుస్థాపనలో కొణతాల రామకృష్ణ, పీలా గోవింద తదితరులు

కశింకోట, అక్టోబర్ 20 (ఆంధ్రజ్యోతి) : రీ సర్వే పేరుతో పేదల భూములను వైసీపీ నేతలు కాజేశారని అనకాపల్లి ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ, మాజీ ఎమ్మెల్యే, రాష్ట్ర అర్బన్ ఫైనాన్స్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ పీలా గోవింద సత్యనారాయణ ఆరోపించారు. మండలంలోని సుందరయ్యపేట, తీడ, చెరకాం, కస్నూరుపాలెం తదితర గ్రామాల్లో ఆదివారం జరిగిన పల్లెపండుగ - పంచాయతీ వారోత్సవాల్లో వారు మాట్లాడారు. జల్ జీవన్ మిషన్ పథకం ద్వారా అనకాపల్లి నియోజకవర్గంలో ప్రతి ఇంటికీ మంచినీటి కొళాయిలు ఏర్పాటు చేస్తామని ఎమ్మెల్యే కొణతాల తెలిపారు. దేశంలో ఎక్కడా లేని విధంగా అభివృద్ధి పనులకు పెద్ద ఎత్తున నిధులు మంజూరు చేసిన ఘనత ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్‌కే దక్కుతుందన్నారు. చోడవరం ఎమ్మెల్యే కేఎస్ఎన్ఎస్ రాజు మాట్లాడుతూ రాష్ట్రాభివృద్ధే కూటమి ప్రభుత్వ ధ్యేయమన్నారు. అంతకు ముందు పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో ఎ.రవికుమార్, ఎన్ఆర్ఈజీఎస్ ఏపీవో మణికుమార్, కూటమి నాయకులు కాయల మురళీ, గొంతిన శ్రీనివాసరావు, పొన్నగంటి అప్పారావు, కర్రి వెంకట సత్యనారాయణ, అక్కునాయుడు, చిరికి సన్యాసినాయుడు, మేడిశెట్టి సన్యాసినాయుడు, దుర్గాప్రసాద్, నిమ్మదల సన్యాసినాయుడు, రెడ్డి సూరిబాబు, ఈశ్వరరావు, రామకృష్ణ, ఎర్రి నాయుడు, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

తుమ్మపాల : మారుమూల గ్రామాలను సైతం అభివృద్ధి చేయడమే ప్రభుత్వం లక్ష్యమని ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ అన్నారు. బవులవాడ, దిబ్బపాలెం, కొండుపాలెం గ్రామాల్లో ఆదివారం నిర్వహించిన పల్లె పండుగ కార్యక్రమంలో మాట్లాడారు. అనకాపల్లి మండలంలో సుమారు వంద మినీ గోకులాల షెడ్లు నిర్మాణానికి నిధులు కేటాయించామని చెప్పారు. అంగన్‌వాడీ కేంద్రాల వద్ద మరుగుదొడ్ల నిర్మాణానికి నిధులు కేటాయిస్తున్నామన్నారు. తొలుత పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ నాయకులు పాల్గొన్నారు.

సీఎం సహాయ నిధికి రూ.లక్ష అందజేత



చెక్కు అందజేస్తున్న సొసైటీ ప్రతినిధులు

కశింకోట, అక్టోబర్ 20 (ఆంధ్రజ్యోతి) : విజయవాడ వరద బాధితుల నిమిత్తం సీఎం సహాయ నిధికి అనకాపల్లి డివిజనల్ పోస్టల్ ఎంప్లాయిస్ కో-ఆపరేటివ్ క్రెడిట్ సొసైటీ అధ్యక్ష, కార్యదర్శులు ఆర్.నూకరాజు, ఉపాధ్యక్షుడు వై.సోమరాజు రూ.లక్ష చెక్కును విరాళంగా అందజేశారు. ఆదివారం తీడ గ్రామంలో పల్లె పండుగ కార్యక్రమానికి హాజరైన ఎమ్మెల్యేకు రాష్ట్ర అర్బన్ ఫైనాన్స్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ పీలా గోవింద సమక్షంలో అందించారు.

'బాల్‌బ్యాడ్మింటన్ క్రీడతో ఉజ్వల భవిష్యత్తు'

అనకాపల్లి టౌన్, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి) : బాల్‌బ్యాడ్మింటన్ క్రీడతో విద్యార్థులకు ఉపాధి అవకాశాలతో పాటు ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని బాల్‌బ్యాడ్మింటన్ అసోసియేషన్ రాష్ట్ర కోశాధికారి భీమరశెట్టి ఆదినారాయణ అన్నారు. ఆదివారం స్థానిక నూకాంబిక అమ్మవారిని దర్శించుకున్న ఆయన విలేకరులతో మాట్లాడారు. పూర్వం నుంచి ఈ క్రీడకు రాష్ట్రంలో మంచి ఆదరణ ఉందన్నారు. దేశంలో ఈక్రీడలు ఎక్కడ నిర్వహించినా ఆంధ్రప్రదేశ్‌కు పతకాలు రావడం ఖాయమన్నారు. ముఖ్యంగా విశాఖ, నర్సీపట్నం, ఎలమంచిలి, ఏటికొప్పాక, మాడుగుల, నునపర్తి, అర్జాపురం, చోడవరం వంటి అనేక ప్రాంతాల్లో రాష్ట్రస్థాయి పోటీలు విజయవంతంగా నిర్వహించిన సందర్భాలున్నాయని గుర్తుచేశారు. ఈ క్రీడలో మరింత మంది విద్యార్థులు రాణించాల్సిందిగా ఆయన కోరారు.

తంతడి- తోటాడ రహదారిని విస్తరించండి

- ఎమ్మెల్యే పంచకర్లకు బీజేపీ నాయకులు వినతి



ఎమ్మెల్యేకు వినతిని అందజేస్తున్న నాయకులు

పరవాడ, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని తంతడి- తోటాడ రహదారిని నాయుడుపాలెం జంక్షన్ నుంచి తంతడి వరకు విస్తరించాలని బీజేపీ నాయకుడు బండారు రామునాయుడు విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు ఎమ్మెల్యే పంచకర్ల రమేష్‌బాబును ఆదివారం కలిసి వినతిపత్రం అందజేశారు. ఇటీవల ఈ రహదారిలో వాహనాల రాకపోకలు అధికమయ్యాయని, దీని కారణంగా తరుచూ ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయని పేర్కొన్నారు. రహదారి ఇరుకుగా ఉండడం వలనే ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు. రహదారిని విస్తరించి వాహనచోదకుల కష్టాలను తీర్చాలని కోరారు. అలాగే నాయుడుపాలెం పంచాయతీ పరిధిలో అపరిష్కృతంగా ఉన్న సమస్యల పరిష్కారానికి చొరవ చూపాలన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు వాసుపల్లి సోమశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా వెయిట్ లిఫ్టింగ్ పోటీలు



వెయిట్ లిఫ్టింగ్ పోటీలు జరుగుతున్న దృశ్యం

నర్సీపట్నం, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి): ఎన్టీఆర్ మినీ స్టేడియంలో స్కూల్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఉమ్మడి విశాఖ జిల్లా స్థాయి వెయిట్ లిఫ్టింగ్, పవర్ లిఫ్టింగ్ పోటీలు జరిగాయి. ఆదివారం జడ్పీటీసీ సభ్యురాలు సుకల రమణమ్మ ఈ పోటీలను ప్రారంభించారు. అనకాపల్లి, విశాఖపట్నం, పాడేరు ప్రాంతాల క్రీడాకారులు పోటీల్లో ఉత్సాహంగా పాల్గొన్నారు. విజేతలను రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక చేస్తామని పీడీ దేవి తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంఈవోలు తలుపులు, నాగేంద్ర, నియోజకవర్గ కోఆర్డినేటర్ శ్రీనివాసులనాయుడు, పీడీలు పాల్గొన్నారు.

మైదానం కాదు.. చెరువే..

- గుర్రపుడెక్కలు పెరిగిపోవడంతో రూపు మారిన పైడమ్మ బంద



గుర్రపుడెక్కలతో నిండి ఉన్న పరవాడలోని పైడమ్మ బంద చెరువు

పరవాడ, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి) : ఇక్కడి సీతారామ కల్యాణ మండపం నుంచి పైడమాంబ ఆలయానికి వెళ్లే ప్రధాన రహదారికి ఆనుకుని ఉన్న పైడమ్మబంద చెరువు పచ్చని మైదానాన్ని తలపిస్తోంది. చెరువు నిండా గుర్రపుడెక్కలు ఏపుగా పెరిగిపోవడంతో అది చెరువా.. లేక మైదానమా.. అన్న సందేహం కలుగుతోంది. ఈ కారణంగా నీరు కుళ్లి దుర్వాసన వెదజల్లుతోంది. దీంతో అటుగా రాకపోకలు సాగించే వారు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇదే విషయమై ఆయకట్టు రైతులు సైతం గగ్గోలు పెడుతున్నారు. ఇరిగేషన్‌శాఖ అధికారులు తక్షణమే స్పందించి చెరువులో ఉన్న గుర్రపుడెక్కలను పూర్తిగా తొలగించేలా చర్యలు చేపట్టాలని వారంతా కోరుతున్నారు.

శారదానగర్‌లో బాబా పల్లకీ ఊరేగింపు

కొత్తూరు, అక్టోబర్ 20 (ఆంధ్రజ్యోతి) : శరన్నవరాత్రి ఉత్సవాలు పూర్తయిన సందర్భంగా సాయిబాబాకు పల్లకీ సేవను ఆదివారం శారదా నగర్‌లో అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయం నుంచి ఎన్‌జీవోస్ కాలనీ వరకు ఊరేగింపు సాగింది. దసరా రోజు నుంచి ప్రతిరోజూ విశేష పూజలు నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకులు కేవీఎస్ భాస్కర రావు, కమిటీ సభ్యులు కరణం మురళీ, కరణం మోహనరావు, ఆనంద్, శ్రీను పాల్గొన్నారు.

నిత్యావసరాల ధరలు తగ్గించాలి

పరవాడ, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి) : నిత్యావసర సర కుల ధరలు ఆకాశాన్నంటుతున్నాయని, దీనివల్ల సామాన్యులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఐద్వా జిల్లా అధ్యక్షురాలు పి.మాణిక్యం ఆదివారం ఒక ప్రకటనలో ఆవేదన వ్యక్తం చేశారు. కూరగాయల ధరలు ఒక్కసారిగా పెరిగిపోవడంతో ఏమీ కొనుక్కోలేని పరిస్థితి ఏర్పడిందని వివరించారు. ధరలు తగ్గించేందుకు ప్రభుత్వం తక్షణమే చర్యలు చేపట్టాలని కోరారు. నిత్యావసర సరుకులను ప్రభుత్వం రేషన్ డిపోల ద్వారా రాయితీపై అందజేయాలని విజ్ఞప్తి చేశారు.

సైన్స్ ఎగ్జిబిషన్‌లో గురుకుల విద్యార్థుల ప్రతిభ

దేవరాపల్లి, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి): జిల్లా స్థాయి గురుకుల పాఠశాలల సైన్స్ ఎగ్జిబిషన్‌లో తెనుగుపూడి గురుకుల విద్యార్థులు ద్వితీయ స్థానం సాధించినట్టు ఉపాధ్యా యులు తెలిపారు. ఈ నెల 18న కొక్కిరాపల్లిలో జరిగిన సైన్స్, ఆర్ట్ పోటీల్లో కె.ప్రవీణ్, కె.సుధీర్ ద్వితీయ స్థానం సాధించారన్నారు. జిల్లా కోఆర్డినేటర్ ఎస్.రూపవతి వీరికి ప్రశంసాపత్రం అందజేశారు. ప్రిన్సిపాల్ రఘు తదితరులు పాల్గొన్నారు.

నేల పాలవుతున్న తాగునీరు

- పరవాడ బొంకులదిబ్బ వీధిలో పైపులైన్‌కు రంధ్రం
- నీటి వృథాను అరికట్టడంలో అధికారుల నిర్లక్ష్యంపై ఆగ్రహం



పైపులైన్‌కు రంధ్రం పడిన దృశ్యం



ప్రధాన రహదారి పై వృథాగా పోతున్న తాగునీరు

పరవాడ, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రం పరవాడ బొంకులదిబ్బ వీధిలోని టిఫిన్ సెంటర్ వద్ద ప్రధాన రహదారికి ఆనుకుని ఉన్న పైపులైన్ నుంచి తాగునీరు వృథాగా పోతుంది. రోడ్డు అడుగు భాగం నుంచి పైపులైన్‌కు రంధ్రం ఏర్పడడంతో గత కొన్ని రోజులుగా ఈ సమస్య ఏర్పడుతోంది. అయినప్పటికీ పంచాయతీ అధికారులు తమకేమీ పట్టనట్టు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని స్థానికులు వాపోతున్నారు. దీనికితోడు రహదారిపై నిరంతరం నీరు నిల్వ ఉండడంతో అటుగా రాకపోకలు సాగించే ద్విచక్ర వాహనదారులకు ప్రమాదం పొంచి ఉంది. రోడ్డు పై నీరు పారడం వల్ల సడన్‌గా వాహనానికి బ్రేకులు వేస్తే పడిపోయే ప్రమాదం పొంచి ఉంది. అధికారులు తక్షణమే స్పందించి పైపులైన్‌కు మరమ్మతులు చేపట్టి తాగునీరు వృథాను అరికట్టాలని పలువురు కోరుతున్నారు.

'తగ్గించిన పాల ధరను పునరుద్ధరించాలి'

అనకాపల్లి టౌన్, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి) : విశాఖ డెయిరీ యాజమాన్యం పాల ఉత్పత్తిదారుల నుంచి సేకరిస్తున్న పాలకు ధర తగ్గించడం అన్యాయమని సీపీఎం జిల్లా కార్యదర్శి కె.లోకనాథం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. వ్యవసాయ రంగం లాభసాటిగా లేకపోవడం వల్ల ఉత్తరాంధ్ర జిల్లాల్లోని సుమారు మూడు లక్షల మంది రైతులు పాడిపై ఆధారపడి కుటుంబాలను పోషించుకుంటున్నారని వివరించారు. డెయిరీ ఇస్తున్న ధర ఏ మాత్రం గిట్టుబాటు లేదని తెలిపారు. డెయిరీ యాజమాన్యం ఆవుపాలకు లీటరుకు మూడు రూపాయలు తగ్గించడం వల్ల పాడి రైతులకు తీవ్ర నష్టం జరుగుతుందని వివరించారు.

అమరుల త్యాగం... అజరామరం

నేడు పోలీస్ అమరవీరుల సంస్మరణ దినం

- బీచ్‌రోడ్డులో ఘనంగా ఏర్పాట్లు
- ఏర్పాట్లను పరిశీలించిన సీపీ శంఖబ్రతబాగ్చి



విశాఖపట్నం, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి): పోలీస్ అనగానే చాలామందికి జాలి, దయ, కనికరం లేకుండా కఠినంగా ఉంటారనే భావన కలుగుతుంది. కానీ ఆపదలో ఉన్నవారిని అక్కున చేర్చుకుని తామున్నామనే భరోసా కల్పించే ఆపద్బాంధవులు కూడా పోలీసులే అని కొద్దిమంది మాత్రమే గుర్తిస్తారు. సమాజ శ్రేయస్సే తమ శ్రేయస్సుగా... ప్రజల యోగక్షేమాలే... తమ కుటుంబసభ్యుల యోగక్షేమాలుగా భావించి నిరంతరం విధి నిర్వహణలో మమేకమతారు. కొన్ని సందర్భాల్లో ప్రాణాలను పణంగా పెట్టడానికి వెనుకాడని పోలీసుల త్యాగం అజరామరమనే చెప్పుకోవాలి. అలాంటి వారి సేవలు, అమరులైన వారి త్యాగాలను స్మరించుకునేందుకు పోలీసులు ఏటా అక్టోబర్ 21న 'అమరవీరుల సంస్మరణ దినం'గా జరుపుకుంటారు. ఈ ఏడాది కూడా పోలీస్ అమరవీరుల సంస్మరణ దినం కోసం నగర పోలీస్ కమిషనరేట్ అధికారుల ఆధ్వర్యంలో బీచ్‌రోడ్డులోని అమరవీరుల స్థూపం వద్ద ఏర్పాట్లు చేశారు.

అమరవీరుల సంస్మరణ దినం నేపథ్యం ఇది

చైనా సరిహద్దు ప్రాంతమైన లడక్ సమీపంలోని హాట్‌స్ప్రింగ్స్ ప్రాంతంలో మన కేంద్ర పారా మిలటరీదళం (సీఆర్‌పీఎఫ్) 1959, అక్టోబరు 21న గస్తీ నిర్వహిస్తోంది. సీఆర్పీఎఫ్‌కు చెందిన పదిమంది జవాన్లు తమ సరిహద్దులోకి చొరబడ్డారంటూ చైనా సైనికులు వారిని నిర్బంధించారు. చైనా సైన్యం వారిని అనేక చిత్రహింసలకు గురిచేసి అనంతరం అతికిరాతంగా తుపాకీలతో కాల్చి చంపేసింది. అమరులైన వారి పోరాటాన్ని, స్ఫూర్తిని స్మరించుకుని, అంకితభావంతో విధులు నిర్వర్తించడం కోసం అప్పటి నుంచి ప్రతీ ఏటా అక్టోబరు 21న దేశవ్యాప్తంగా పోలీసు అమరవీరుల సంస్మరణ దినం జరుపుతున్నారు.

నగర పోలీస్ కమిషనరేట్ విషయానికి వస్తే.. బీచ్‌రోడ్డులోని అమరవీరుల స్థూపం వద్ద ఏటా ప్రత్యేక కార్యక్రమం నిర్వహిస్తారు. వారం రోజుల పాటు పరేడ్ రిహార్సల్స్‌తో పాటు పాఠశాలల్లో విద్యార్థులకు చిత్రలేఖనం, వ్యాసరచన పోటీలు నిర్వహిస్తారు. పోలీసులు నిర్వర్తించే విధులు, వినియోగించే ఆయుధాలపై అవగాహన కల్పించడం కోసం ఓపెన్‌హౌస్ పేరుతో ప్రతీ స్టేషన్‌లోనూ ప్రత్యేక కార్యక్రమాలు చేపడతారు విజేతలైన వారికి బహుమతులతోపాటు ప్రశంసాపత్రాలు అందజేస్తారు. సోమవారం పోలీస్ అమరవీరుల సంస్మరణ దినం సందర్భంగా బీచ్‌రోడ్డులోని అమరవీరుల స్థూపం వద్ద ఘనంగా ఏర్పాట్లు చేశారు. సీపీ శంఖబ్రతబాగ్చి ఏర్పాట్లను ఆదివారం పరిశీలించారు. పరేడ్ రిహార్సల్స్‌లో పాల్గొని సిబ్బందికి కొన్ని సూచనలు చేశారు. సోమవారం ఉదయం ఏడు గంటల నుంచి అమరవీరుల సంస్మరణ దినం వేడుకలు ప్రారంభమవుతాయి. సీపీ శంఖబ్రతబాగ్చి, విశాఖ రేంజ్ డీఐజీ గోపీనాథ్‌జెట్టీతో పాటు ఇతర పోలీస్ ఉన్నతాధికారుల సమక్షంలో సిబ్బంది పరేడ్ నిర్వహిస్తారు. నగరంతో పాటు జిల్లాకు చెందిన పోలీస్ ఉన్నతాధికారులు, అధికారులు కూడా ఈ కార్యక్రమంలో భాగస్వాములవుతారు. గడిచిన ఏడాది కాలంలో అమరులైన పోలీసులతో పాటు అంతకు ముందు కూడా విధి నిర్వహణలో ప్రాణాలు కోల్పోయిన పోలీస్ అమరవీరుల పేర్లను చదివి వినిపిస్తారు. వారి త్యాగాల స్ఫూర్తితో విధినిర్వహణలో పునరంకితం అవుతామని ప్రతిజ్ఞ చేస్తారు. అమరులైన వారి కుటుంబసభ్యులతో ఉన్నతాధికారులు సమావేశమవుతారు. వారి సమస్యలను తెలుసుకోవడంతో పాటు వారికి అవసరమైన ఆర్థిక సహాయం అందజేసి అండగా తామున్నామనే భరోసా కల్పిస్తారు.



తీరంలో రిహార్సల్ పరిశీలిస్తున్న సీపీ శంఖబ్రతబాగ్చి

అయోడిన్ లోపిస్తే తిప్పలే..



శరీరానికి అవసరమైన సూక్ష్మ పోషకాల్లో అయోడిన్ కీలకం

- లోపిస్తే అనేక అనారోగ్య సమస్యలు
- అయోడైజ్డ్ ఉప్పు వినియోగంతో సమస్యలకు చెక్
- నేడు ప్రపంచ అయోడిన్ లోప వ్యాధుల నివారణ దినోత్సవం

అయోడిన్.. శరీరానికి అవసరమైన సూక్ష్మ పోషకాల్లో ముఖ్యమైనది. అయోడిన్ లోపిస్తే అనేక వ్యాధులు వచ్చే అవకాశం ఉంది. రోజువారీ తీసుకునే ఆహారంలో అయోడిన్ ఉండాలి. ముఖ్యంగా హార్మోన్ల ఉత్పత్తికి కీలకం. అయోడిన్ పట్ల ప్రజల్లో అవగాహన లేకపోవడంతో అనేక ఇబ్బందులకు గురవుతున్నారు. ప్రతి వంద మందిలో 20 మంది అయోడిన్ లోపంతో బాధపడుతున్నట్టు పలు పరిశోధనల్లో వెల్లడైంది. అయోడిన్ లోపం వల్ల కలిగే వ్యాధుల పట్ల ప్రజల్లో అవగాహన కలిగించే ఉద్దేశంతో ఏటా అక్టోబరు 21న ప్రపంచ అయోడిన్ లోప వ్యాధుల నివారణ దినం నిర్వహిస్తున్నారు.

విశాఖపట్నం, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి): శరీరంలో జీవ క్రియలు సక్రమంగా జరగాలంటే సూక్ష పోషకాలకు చెందిన అయోడిన్ వంటి మూలకాలు అవసరం. గొంతు వద్ద ఉండే థైరాయిడ్ గ్రంథి తీసుకున్న ఆహారం ముడి ఆర్గానిక్ రసాయన అణువులను నాలుగు అయోడిన్ పరమాణు వులుగా గ్రహించి థైరాక్సిన్ హార్మోన్ తయారుచేస్తుంది. అయోడిన్ శరీరానికి అందకపోతే థైరాక్సిన్ తయారు కాదు. దీని ఉత్పత్తి లోపిస్తే అనారోగ్య సమస్యలు వస్తాయి. ముఖ్యంగా గాయిటర్. మెడకు కుడి, ఎడమ వైపుల వాపు. దీంతో పాటు మెదడు ఎదుగుదల లేకపోవడం, జ్ఞాపకశక్తి కేంద్రీకరించలేకపోవడం, క్రిటి నిజమ్, కండరాలు బలంగా మారడం, వినికిడి లోపం, సరిగ్గా మాట్లాడలేకపోవడం, చిరాకు, హుషారు లేకపోవడం వంటి రుగ్మతలు వేధిస్తాయి. గర్భిణులు తీసుకునే ఆహారంలో అయోడిన్ లోపిస్తే శిశువుల్లో అసాధారణ లోపాలు వచ్చే ప్రమాదం ఉందని నిపుణులు హెచ్చరిస్తున్నారు. గర్భస్రావం, మృత శిశు జననాలకు, పిల్లలు పుట్టకపోవడం వంటి సమస్యలకు అవకాశం ఉంది.

గాయిటర్‌తో జాగ్రత్త

రోజు వారీ తీసుకునే ఆహారంలో తగినంత అయోడిన్ లేకపోతే గాయిటర్ వ్యాధి బారిన పడే ప్రమాదం ఉంది. ఈమేరకు వరల్డ్ హెల్త్ ఆర్గనైజేషన్ 1952 నుంచి ఇంటర్నేషనల్ గాయిటర్ కంట్రోల్ ప్రొగ్రామ్‌ను ప్రారంభించింది. ఈ క్రమంలో ఏటా అయోడిన్ లోపవ్యాధుల నివారణ దినోత్సవం నిర్వహిస్తున్నారు. దేశంలోని ప్రజలకు అయోడిన్ లోపాన్ని తగ్గించే ఉద్దేశంతో కేంద్ర ప్రభుత్వం ఆహార పదార్థాల్లో అయోడైజ్డ్ ఉప్పునే వాడాలంటూ 2005లో చట్టం చేసింది.



అయోడిన్ లభించే పదార్థాలు

అయోడిన్ అతి కొద్ది వాటిల్లో మాత్రమే లభిస్తుంది. మట్టి, సముద్రం, చేపలు, నాచు, సముద్రంలోని కలుపు మొక్కల్లో ఉంటుంది. గుడ్డు, పాలు, చెర్రీ, బనానా, దుంపల్లోనూ లభిస్తుంది. మట్టిలో రసాయనాల వినియోగం, అడవులు అంతరించిపోవడం, భారీ వర్షాలు వల్ల మట్టిలో ఉన్న అయోడిన్ పూర్తిగా తగ్గిపోతోంది. కొండ ప్రాంతాల్లో ఉండే గిరిజనుల్లో అయోడిన్ లోపం అధికం. దీనికి కారణం కొండవాలు ప్రాంతాల్లోని మట్టి వర్షాలకు కింద ప్రాంతాలకు వెళ్లడమేనని నిపుణులు చెబుతున్నారు.

ఉప్పులో అయోడిన్ కలిపి..

అయోడిన్ లోపంతో బాధపడుతున్న వారి సంఖ్య పెరుగుతుండడంతో వరల్డ్ హెల్త్ ఆర్గనైజేషన్ ప్రత్యామ్నాయ ఏర్పాట్లపై దృష్టిసారించింది. అయోడిన్‌ను అన్ని వర్గాల ప్రజలకు అందించేందుకు తక్కువ ధరకు లభించే ఉప్పును వాహకంగా వాడాలని నిర్ణయించింది. ఉప్పులో అయోడిన్‌ను కలిపి అందేలా చేస్తున్నారు. తక్కువ ధరకే అయోడైజ్డ్ ఉప్పు విక్రయించాలన్న నిబంధన ఉన్నా క్షేత్రస్థాయిలో అమలు కావడం లేదు.

భారత్ వికాస్ కృషి అభినందనీయం

- ఆచార్య దోర్బల ప్రభాకరశర్మ
- జాతీయ స్థాయి బృందగాన పోటీల్లో ఉమ్మడి విశాఖ జిల్లా విద్యార్థుల ప్రతిభ



వేదికపై దోర్బల ప్రభాకరశర్మ, భారత్ వికాస్ పరిషత్ ప్రతినిధులు

కొవ్వూరు, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి): ప్రతి పౌరుడిలో విద్యార్థి దశ నుంచి దేశభక్తిని పెంపొందించేందుకు భారత్ వికాస్ పరిషత్ చేస్తున్న కృషి అభినందనీయమని మహామహోపాధ్యాయ, సంస్కృతాంధ్ర పండింతుడు ఆచార్య దోర్బల ప్రభాకర శర్మ అన్నారు. ఆదివారం కొవ్వూరు పరిమి రామారాయుడు రత్తమ్మ కల్యాణ మండపంలో డాక్టర్ రమేష్ యల్లాప్రగడ అధ్యక్షతన భారత్ వికాస్ పరిషత్ ప్రాంత జాతీయ బృందగాన పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంపర్క్, సహయోగ్, సంస్కార్, సేవ సమర్పణ్ పరమావిధిగా విద్యార్థుల్లో దేశభక్తి, సేవాతత్పరతను పెంపొందించేందుకు భారత్ వికాస్ పరిషత్ 62 ఏళ్లుగా కృషి చేస్తోందన్నారు.

ఈ పోటీల్లో హిందీ, సంస్కృత విభాగాల్లో 8 బృందాలు, తెలుగు, జానపద విభాగాల్లో 9 బృందాలు పాల్గొన్నాయి. ప్రథమ బహుమతి డీఏవీ స్కూల్ (అనకాపల్లి), ద్వితీయ బహుమతి విశాఖ వ్యాలీ (విశాఖపట్నం), తృతీయ బహుమతి శ్రీప్రకాష్ విద్యానికేతన్ (పాయకరావుపేట), మోటివేషన్ బహుమతి డీఏవీ పాఠశాల కొవ్వూరు బృందాలకు లభించాయి. ప్రథమస్థానంలో నిలిచిన డీఏవీ స్కూల్ అనకాపల్లి బృందం హిందీ, సంస్కృత విభాగంలో సౌత్ విభాగం హైదరాబాద్‌లో జరిగే పోటీల్లో పాల్గొంటుందని నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో విశాఖ ప్రాంత అధ్యక్షుడు వంకాయల సన్యాసిరాజు, జీబీవీ సుబ్రహ్మణ్యం, తాడోజు సాయి కృష్ణ, సౌత్ రీజియన్ జనరల్ సెక్రటరీ పురుషోత్తమ శాస్త్రి, రీజనల్ జాయింట్ సెక్రటరీ ఎంవీవీ సత్యనారాయణ, బి.సుబ్బారావు, భారత్ వికాస్ పరిషత్ సభ్యులు పాల్గొన్నారు.

టీడీపీ, బీజేపీ మధ్య ఆధిపత్య పోరు

... 5వ పేజీ తరువాయి

వారు వేర్వేరుగా టెంట్‌లు వేసినట్టు తెలియడంతో ఎమ్మెల్యే అక్కడ కార్యక్రమాన్ని రద్దు చేశారు. నునపర్తిలో రాజకీయంగా రెండు వర్గాలు ఆధిపత్యాన్ని చెలాయిస్తున్నాయి. గతంలో చుక్క జోగినాయుడు వర్గం కాంగ్రెస్, రెడ్డి సన్యాసినాయుడు వర్గం తెలుగుదేశం పార్టీలో వుండే వారు. జోగినాయుడు వైసీపీ ఆవిర్భావం తరువాత ఆ పార్టీలో చేరారు. గత పంచాయతీ ఎన్నికల ముందు జోగినాయుడు చనిపోవడంతో ఆయన భార్య చుక్క అనూరాధను సర్పంచ్‌గా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అసెంబ్లీ ఎన్నికల ముందు అనూరాధ బీజేపీలో చేరారు. కూటమి అధికారంలోకి వచ్చిన తరువాత టీడీపీ, బీజేపీ నేతల మధ్య ఆధిపత్య పోరు మొదలైంది. ఈ విషయం ఎమ్మెల్యే దృష్టికి వచ్చినప్పటికీ బీజేపీలోని కొందరు నాయకులు తనకు సన్నిహితంగా ఉండడంతో వారి మాటలు విని, ఆధిపత్య పోరు గురించి పట్టించుకోలేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి. వాస్తవానికి మండలంలో బీజేపీకి పెద్దగా పట్టులేదు. అయినప్పటికీ ఎమ్మెల్యే విజయకుమార్ ఆ పార్టీ వారికే వత్తాసు పలుకుతూ, తమను చిన్నచూపు చూస్తున్నారని టీడీపీ నాయకులు ఆరోపిస్తున్నారు. ఈ నేపథ్యంలో నునపర్తిలో పల్లె పండుగ కార్యక్రమానికి ఎవరికి వారే ఏర్పాట్లు చేయడంతో వివాదాన్ని మరింత పెద్దది చేయడం ఇష్టం లేక, ఎమ్మెల్యే విజయకుమార్ ఈ కార్యక్రమానికి హాజరుకాకుండా రద్దు చేశారని జనసేన పార్టీ నాయకులు చెబుతున్నారు.

అచ్యుతాపురం మీదుగా కాకినాడకు రోడ్డు

- లంకెలపాలెం నుంచి నాలుగు లేన్లతో ఏర్పాటుకు కృషి
- పల్లె పండుగతో గ్రామాల్లో మౌలిక సదుపాయాలు
- రామన్నపాలెం సభలో అనకాపల్లి పార్లమెంట్ సభ్యుడు సీఎం రమేశ్



రామన్నపాలెంలో మాట్లాడుతున్న ఎంపీ సీఎం రమేశ్, చిత్రంలో ఎమ్మెల్యే విజయకుమార్

అచ్యుతాపురం, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి) : గ్రామాల్లో మౌలిక సదుపాయాల కల్పనకే పల్లెపండుగ కార్యక్రమాన్ని ప్రభుత్వం రూపొందించిందని అనకాపల్లి ఎంపీ సీఎం రమేశ్ అన్నారు. మండలంలోని రామన్నపాలెంలో ఆదివారం జరిగిన పల్లె పండుగ కార్యక్రమానికి ఆయన హాజరై మాట్లాడారు. ఉపాధి హామీ పథకం నిధులను కేంద్ర ప్రభుత్వం మంజూరు చేసిందని, వీటి ద్వారా గ్రామాల్లో రోడ్లు, కాలువలతో పాటు మౌలిక సదుపాయాలు కల్పించాలని ముఖ్యమంత్రి చంద్రబాబు , ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ నిర్ణయించి ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తుండడం గొప్ప విషయమన్నారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో కూడా కేంద్ర ప్రభుత్వం రాష్ట్రానికి నిధులు మంజూరు చేసిందని, కానీ అప్పటి ముఖ్యమంత్రి జగన్ వైసీపీ రంగులు వేయడానికే ఖర్చు చేశారని ఎద్దేవా చేశారు. ఈ ప్రాంతం పారిశ్రామికంగా అభివృద్ధి చెందుతున్నందున లంకెలపాలెం నుంచి పరవాడ, అచ్యుతాపురం మీదుగా కాకినాడకు నాలుగు లేన్ల రోడ్డు ఏర్పాటుకు కృషి చేస్తానని వెల్లడించారు. సెజ్‌లో త్వరలో కర్మాగారాలు ఏర్పాటవుతాయన్నారు. జగన్ తల్లి, చెల్లి కలిసి జగన్ అబద్ధాలాడడం లేదని చెప్తేచాలు రాష్ట్రంలో ప్రజలంతా నమ్ముతారన్నారు. జగన్ అబద్ధాల పుట్ట విప్పాలంటే ఒక రోజు చాలదన్నారు. అంతకు ముందు రామన్నపాలెంలో పలు అభివృద్ధి పనులకు ఆయన శంకుస్థాపన చేశారు. రామన్నపాలెంలో గల తెలుగు యువత రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డ్రీమ్స్ నాయుడు ఇంటికి వెళ్లి అతని తండ్రి ఇటీవల చనిపోవడంతో పరామర్శించారు. అనంతరం ఆవరాజాం, దోసూరులలో ఎమ్మెల్యే సుందరపు విజయకుమార్, ఎమ్మెల్సీ పప్పల చలపతిరావు పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు రాజాన రమేష్ కుమార్, జనపరెడ్డి శ్రీనివాసరావు, బైలపూడి శ్రీరామదాసు, రాజాన సన్యాసినాయుడు, డ్రీమ్స్ నాయుడు, జనపరెడ్డి నర్సింగరావు, మేరుగు బాపునాయుడు, పల్లి రామునాయుడు, కూనిశెట్టి రమణ, దేశంశెట్టి ఎల్లయ్యనాయుడు, మోటూరు శ్రీవేణి, రాజాన నానాజీ, వియ్యపు నానాజీ, సిరపల్లి రమణ, కె.పవన్ విజయ్ పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి బాల, బాలికల ఖోఖో జట్లు ఎంపిక

- ఒకటి నుంచి తుమ్మపాలలో పోటీలు



రాష్ట్రస్థాయి ఖోఖో పోటీలకు ఎంపికైన జట్లు



తుమ్మపాల, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి): అంతర్ జిల్లాల రాష్ట్ర స్థాయి ఖోఖో పోటీలకు అండర్-17 విభాగం నుంచి ఉమ్మడి విశాఖ జిల్లాల బాల, బాలికల జట్లు ఎంపికయ్యాయి. నవంబరు ఒకటో తేదీ నుంచి మూడో తేదీ వరకు అనకాపల్లి మండలం తుమ్మపాలలో ఈ పోటీలు జరగనున్నాయి. బాలుర జట్టుకు జి.అజయ్, సీహెచ్.డీసీ శంకరరావు, బి.తేజాకిరణ్, బి.సాయి, బి.భాను ప్రసాద్, డి.చరణ్, డి.లోకేశ్, ఆర్.ఓంప్రకాష్, ఎల్.అప్పలరాజు, ఎ.మోనేష్, కె.రాకేష్, ఎం.సూర్యనారాయణ, షణ్ముఖ, జి. భాస్కర్‌లు ఎంపికయ్యారు. బాలికల జట్టుకు జి.అనూష, పి.జ్యోత్స్న, పి.లాస్య, పి.వాగ్దేవి, పి.రామలక్ష్మి, జె.గీత, పి.కావ్య, ఎల్.పావని, కె.లహరి, జి.నయోమి, బి.హేమలత, ఎం.హేమ, కె.పూజిత, కె. ఉదయశ్రీలను ఎంపిక చేశారు. శనివారం అర్ధరాత్రి వరకు జరిగిన ఈ ఎంపిక కార్యక్రమంలో అనకాపల్లి జిల్లా వ్యాయామ ఉపాధ్యాయ సంఘం అధ్యక్షుడు కె.ఎం.నాయుడు, దాడి శ్యామ్‌ప్రసాద్, పీలా వీరునాయుడు, డీవీఎస్‌కేనాయుడు, మోటూరు నాగేశ్వరరావు పాల్గొన్నారు.

మహిళా ఉద్యోగుల విభాగం బలోపేతానికి కృషి

- కూటమి ప్రభుత్వం వచ్చాకే ఒకటో తేదీన జీతాలు
- ఏపీ అమరావతి జేఏసీ మహిళా విభాగం చైర్‌పర్సన్ పారె లక్ష్మి



అనకాపల్లి, నర్సీపట్నం డివిజన్ల కమిటీతో జేఏసీ అమరావతి ప్రతినిధులు

కొత్తూరు, అక్టోబర్ 20 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న మహిళా అధికారులు, ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి ఏపీ జేఏసీ అమరావతి కృషి చేస్తోందని ఆ సంఘం మహిళా విభాగం రాష్ట్ర చైర్‌పర్సన్ పారె లక్ష్మి అన్నారు. అనకాపల్లి మండలంలోని మేజర్ పంచాయతీ కొత్తూరు శారదానగర్‌లో ఉన్న మహర్షి కల్యాణ మండపంలో ఆదివారం జరిగిన జిల్లాస్థాయి సంఘ సమావేశంలో ముఖ్య అతిథిగా మాట్లాడారు. విధి నిర్వహణలో పురుషులతో సమానంగా మహిళలు పాల్గొంటూ అత్యుత్తమ సేవలు అందిస్తున్నారన్నారు. అయితే వీరికి విధులు కేటాయించే సమయంలో ఏ సమస్యలు, ఇబ్బందులు ఎదురైనా సంబంధిత అధికారులే బాధ్యత వహించాల్సి ఉంటుందని స్పష్టం చేశారు. సమయ నియమాలు లేని కొన్ని శాఖలు, విభాగాల్లో మహిళల ఇబ్బందులను సంబంధిత అధికారులు గుర్తించి వీరికి విధులు కేటాయించాలని కోరారు. వీరికి ఉన్న వార్షిక వ్యక్తిగత సెలవులను 35 నుంచి 40కి పెంచాలని ప్రభుత్వాన్ని కోరామని వివరించారు. మహిళా ఉద్యోగుల విభాగాన్ని బలోపేతం చేస్తామన్నారు. ఇప్పటికే అన్ని జిల్లాల్లో కమిటీలను ఏర్పాటు చేశామని, ఇప్పుడు రాష్ట్రంలోని అన్ని డివిజన్‌ల స్థాయిలో కమిటీలను ఏర్పాటు చేస్తున్నామని చెప్పారు. నూతన ప్రభుత్వంలో మహిళలతో పాటు ప్రభుత్వ ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక సమస్యలు పరిష్కారమవుతాయని ఆశాభావం వ్యక్తం చేశారు. ఇందుకు ఏపీ జేఏసీ అమరావతి చైర్మన్ బొప్పరాజు వెంకటేశ్వర్లు కృషి చేస్తున్నారని తెలియజేశారు. కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాతనే ఒకటో తేదీన జీతాలు వేయడానికి కృషి చేయడం హర్షణీయమన్నారు. పదవీ విరమణ చేసిన ఉద్యోగుల బకాయిలను చెల్లించడానికి ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. ఏపీ జేఏసీ అమరావతి జిల్లా చైర్మన్ ఎస్ఎస్‌వీఎస్ నాయుడు (వాసు), కార్యదర్శి డి.లోకరాజు, కోశాధికారి యలమంచిలి శ్రీరామమూర్తి, మహిళా విభాగం జిల్లా చైర్‌పర్సన్ వీరవాణి, కార్యదర్శి లక్ష్మి, ఏపీసీపీఎస్ జిల్లా కార్యదర్శి బోయిన చిన్నారావు, వీఆర్‌వోల సంఘం జిల్లా అధ్యక్షుడు గణపతి రావు (గణేష్) తదితరులు పాల్గొన్నారు.

అనకాపల్లి, నర్సీపట్నం డివిజన్ల నూతన కమిటీలు ఎన్నిక

ఏపీ జేఏసీ అమరావతి మహిళా విభాగం అనకాపల్లి, నర్సీపట్నం డివిజన్ల ఎన్నికలను రాష్ట్ర ప్రతినిధులు పారె లక్ష్మి, విద్య ఆధ్వర్యంలో నిర్వహించారు. అనకాపల్లి డివిజన్ చైర్‌పర్సన్‌గా వి.రాజ్యలక్ష్మి (రెవెన్యూ), కార్యదర్శిగా ఓ.ఆర్. కళ (ఆర్టీసీ)లతో పాటు కార్యవర్గ పదవుల్లోకి జీఎల్ఎన్ ఈశ్వరి, జి.రూప్సీ, ఇందు, కె.జ్యోతిలను ఎన్నుకున్నారు. అలాగే నర్సీపట్నం డివిజన్ చైర్‌పర్సన్‌గా హెచ్.త్రివేణి (రెవెన్యూ), కార్యదర్శిగా కె.నాగమణి (వీఆర్‌వో)లతో పాటు కార్యవర్గ పదవుల్లోకి ఎస్ఎన్ రత్నం, టి.దేవకాంతం, జీఆర్ఎస్ఎన్ రత్నం, కేవీఎస్ఎల్‌జీ కుమార్, ఎం.అమరావతిలను ఎన్నుకున్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

అనంతగిరి, అక్టోబర్ 20 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మర్రిగుడ సమీపంలో ద్విచక్రవాహనంతో అదుపుతప్పి బోల్తాపడిన ఘటనలో ఆదివారం ఇద్దరు పర్యాటకులు తీవ్రంగా గాయపడ్డారు.. అరకు అందాలను తిలకించి, మైదాన ప్రాంతానికి తిరిగి వెళ్తుండగా ప్రమాదవశాత్తూ మర్రిగుడ మలుపువద్ద ద్విచక్రవాహనంతో జారిపడ్డారు. ఈ ప్రమాదంలోని ఏలూరు జిల్లా కామవరపుకోటకు చెందిన పి. చందు, మధు గాయపడ్డారు.. క్షతగాత్రులను స్థానికుల సాయంతో 108 వాహనంలో అనంతగిరి పీహెచ్‌సీకి తరలించి, మెరుగైన వైద్యసేవల నిమిత్తం ఎస్. కోట ఆస్పత్రికి తరలించారు.

గ్రావెల్ దందా.. రాజకీయ అండ

... 5వ పేజీ తరువాయి

గ్రావెల్ తవ్వకాలు మొదలుపెట్టారు. వీఎంఆర్‌డీఏ అధికారుల పర్యవేక్షణ లేకపోవడం, స్థానికంగా వుండే రెవెన్యూ అధికారులు తమకు సంబంధం లేదన్నట్టుగా వ్యవహరించడం, మైనింగ్ అధికారులు ఇటువైపు కన్నెత్తి అయినా చూడకపోవడం అక్రమార్కులకు బాగా కలిసొచ్చింది. లేఅవుట్లలో పలుచోట్ల 10 నుంచి 15 అడుగుల లోతున గ్రావెల్ తవ్వుతున్నారు. 15 నుంచి 20 మంది వరకు అచ్చంగా గ్రావెల్ అక్రమ తవ్వకాలు, రవాణా, అమ్మకాలతో భారీగా సొమ్ము గడిస్తున్నారు. వీరిలో పలువురికి సొంతంగా ఎక్స్‌కవేటర్లు, టిప్పర్ లారీలు, డంపర్ లారీలు వున్నాయి. రాత్రిపూట ఇక్కడ తవ్విన గ్రావెల్‌ను సబ్బవరం మండలానికి అనుకుని వున్న వెదుళ్లరవ, కొత్తూరు, సంధ్యానగర్ కాలనీ, అజనగిరి తదితర ప్రాంతాల్లో ప్రైవేటు స్థలాల్ల నిల్వ చేస్తున్నారు. ఇటువంటి స్టాక్ పాయింట్లు 20 వరకు వున్నాయి. ఇక్కడి నుంచి పగటిపూట గాజువాక, పరవాడ, అగనంపూడి, తదితర ప్రాంతాలకు తరలించి భారీగా ఆర్జిస్తున్నారు.

ఫిర్యాదులు చేసినా..

పేదల ఇళ్ల స్థలాల లేఅవుట్లలో గ్రావెల్ అక్రమ తవ్వకాలపై మైనింగ్, రెవెన్యూ అధికారులకు ఫిర్యాదులు చేస్తున్నప్పటికీ పట్టించుకోవడంలేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. పైగా ఫిర్యాదు చేసిన వారి వివరాలను.. గ్రావెల్ తవ్వకందారులకు తెలియపరిచి, ఫిర్యాదుదారులపై పరోక్షంగా దాడులకు ఉసిగొల్పుతున్నారు. ఇక గ్రావెల్ తవ్వకాలపై పత్రికల్లో వార్తలు వస్తే.. సంబంధిత అధికారులు మొక్కుబడిగా తనిఖీలు నిర్వహించి ఎక్స్‌కవేటర్లు, లారీలకు నామమాత్రంగా జరిమానాలు విధించి వదిలేస్తున్నారు. ఇళ్ల స్థలాల లేఅవుట్లలో భారీగా గ్రావెల్ తవ్వకాలు జరుగుతుంటే వీఎంఆర్‌డీఏ అధికారులు ఏం చేస్తున్నారని స్థానికుతోపాటు లబ్ధిదారులు ప్రశ్నిస్తున్నారు. ఇళ్ల నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తి చేసి, వచ్చేఏడాది మార్చినాటికి లబ్ధిదారులకు అప్పగించాలని విశాఖ జిల్లా కలెక్టర్ హరేంధిర్ ప్రసాద్ ఇటీవల గొల్లలపాలెంలో పర్యటించిన సందర్భంగా అధికారులను ఆదేశించారు. మరి ఇళ్ల స్థలాల లేఅవుట్లలో గ్రావెల్ అక్రమార్కులు తవ్విన భారీ గోతులు (చిన్నపాటి చెరువులు) ఎలా పూడుస్తారని స్థానికులు ప్రశ్నిస్తున్నారు.

అధ్వాన రోడ్లకు మోక్షం

... 5వ పేజీ తరువాయి

రూ.79.81 కోట్లతో 28.6 కిలోమీటర్లు, బుచ్చెయ్యపేట మండలం వడ్డాది నుంచి మాడుగుల నియోజకవర్గం మీదుగా అల్లూరి సీతారామరాజు జిల్లా పాడేరు మండలం గరికబంధ వరకు రూ.23.59 కోట్లతో 12.7 కిలోమీటర్ల మేర రోడ్డు పనులు పూర్తిచేయవలసి ఉంది. నర్సీపట్నం నియోజకవర్గంలో నర్సీపట్నం నుంచి నీలంపేట వరకు రూ.2.57 కోట్లతో ఒక కిలోమీటరు రోడ్డు, పాయకరావుపేట నియోజకవర్గంలో కోటవురట్ల మండలం ఇందేశమ్మ ఘాట్ నుంచి ఎస్.రాయవరం మండలం అడ్డరోడ్డు (పెదగుమ్ములూరు) వరకు రూ.20.78 కోట్లతో 7.86 కిలోమీటర్లు, పెందుర్తి నియోజకవర్గంలో సబ్బవరం నుంచి పినగాడి రూట్‌లో రూ.13.92 కోట్లతో 7.13 కిలోమీటర్లమేర్లు, విశాఖ జిల్లా భీమిలి నియోజకవర్గంలో పద్మనాభం-శొంఠ్యాం (నీళ్ల కుండీల జంక్షన్) మధ్య రూ.10.04 కోట్లతో 3.55 కిలోమీటర్ల మేర రోడ్లను అభివృద్ధి చేయాల్సి వుంది.

ఐదేళ్ల నరకయాతనకు త్వరలో విముక్తి

న్యూ డెవలప్‌మెంట్ బ్యాంకు నిధులతో చేపట్టిన రోడ్ల పనులను వైసీపీ ప్రభుత్వం పట్టించుకోకపోవడంతో దారుణమైన రహదారులతో ప్రజలు ఐదేళ్ల నుంచి ప్రత్యక్ష నరకాన్ని అనుభవిస్తున్నారు. ప్రత్యేకించి చోడవరం నియోజకవర్గంలో వెంకన్నపాలెం నుంచి రేలుగుంట మండలం శివారు వరకు. మాడుగుల నియోజకవర్గంలో వడ్డాది నుంచి పాడేరు మండలం గరికబంధ వరకు, కోటవురట్ల మండలం ఇందేశమ్మ ఘాట్ రోడ్డు భారీ గోతులతో అత్యంత దారుణంగా తయారయ్యాయి. వాహనాలు పాడైపోవడం, ప్రయాణం సమయం పెరిగిపోవడం, భారీ గోతుల్లో వాహనాలు కూరుకుపోవడం వంటి సమస్యలతో తీవ్ర ఇబ్బందులు పడ్డారు. అయినా నాటి వైసీపీ పాలకులు కనీసం స్పందించలేదు. వైసీపీ ప్రభుత్వం దిగిపోయి కూటమి అధికారంలోకి రావడం, ఎన్‌డీబీ ప్రాజెక్టు కింద చేపట్టిన పనులకు పెండింగ్ నిధులు విడుదల చేయడంతోపాటు, పనులు పునఃప్రారంభానికి చర్యలు చేపట్టడంతో ఆయా మార్గాల్లో ప్రయాణించే వారు ఊపిరి పీల్చుకుంటున్నారు.

చికెన్ ధరలు

బ్యాగ్	రూ.లలో
రైతు ధర	115.00
లైవ్ ధర	135.00
విత్ స్కిన్	234.00
స్కిన్ లెస్	250.00

కోడి గుడ్లు (నెక్)

వంద గుడ్లు	రూ.లలో
విశాఖపట్నం	515
విజయనగరం	514
శ్రీకాకుళం	514